
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 26.0
కనిష్ఠం 16.2

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 2 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	580.10 (283.3042)	37,513	37,513
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	879.08	260.19
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	2,100	2,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



స్థానిక సమరం

గ్రామపంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై 60ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఎస్సీ వర్గాలకు సర్పంచ్ పదవి తీరని కలగానే మిగిలింది. ఇప్పటివరకు 12 పర్యాయాలు సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగ్గా, ఆ గ్రామాల్లో ఎస్సీ జనాభా ఉన్నా, ఆ వర్గాలకు రిజర్వేషన్ దక్కలేదు. ఎస్సీలకు రాజ్యాంగపర రిజర్వేషన్ కల్పిస్తున్నా, రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వాలు చేస్తున్న మార్పులు, చేర్పులతో ఆ వర్గాలకు అవకాశం రావడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

వారికి సర్పంచ్ పదవి దూరం

- రిజర్వేషన్లలో తరచూ మార్పులతో చేజారుతున్న అవకాశాలు
- నార్కట్‌పల్లి, నిడమనూరు మేజర్ పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి

వరుసగా రొటేషన్ అమలుచేస్తున్నా, ప్రతీ సందర్భంలో నిబంధనలు మారడం,తదితర కారణాలతో రొటేషన్ మళ్లీ మొదటికి వచ్చి ఆ వర్గాలు అవకాశాన్ని కోల్పోతున్నాయి. జిల్లాలో నార్కట్‌పల్లి, నిడమనూరు వంటి మేజర్ పంచాయతీల్లోనూ ఇలాంటి పరిణామాలతో ఇప్పటివరకు ఎస్సీలకు సర్పంచ్ అవకాశం దక్కలేదు.

ఎన్నికలు, రిజర్వేషన్ల అమలు విధానాల్లో మార్పులతో

గ్రామపంచాయతీల పాలకవర్గాల ఏర్పాటు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు మారిన ప్రతీ సందర్భంలో పంచాయతీల్లో ఎన్నికల విధానాలు, రిజర్వేషన్ల అమలు నిబంధనలు మారుతూ వస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో ఎస్సీలకు సర్పంచ్ పదవి దక్కడం లేదు. ఎస్సీలకు రాజ్యాంగపర రిజర్వేషన్ కల్పించాల్సి ఉండడంతో పంచాయతీ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి గ్రామపంచాయతీల్లో రిజర్వేషన్లు కేటాయిస్తూ వస్తున్నారు. అయితే రిజర్వేషన్ అమలులో తరచూ మార్పులు చేస్తుండడంతో ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలకు నిబంధనలు మారిన సందర్భంలో కొన్ని వర్గాలకు తరచూ అవకాశాలు వస్తే, తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో ఇప్పటివరకు అవకాశం దక్కని పరిస్థితి నెలకొంది. 1964 నుంచి రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కొనసాగుతుండగా, గ్రామపంచాయతీలకు తొలుత వార్డు సభ్యుల ద్వారా పరోక్ష పద్ధతిలో సర్పంచ్‌ను ఎన్నుకునేవారు. 1978 వరకు ఈ విధానం కొనసాగగా, ఆ తర్వాత సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానం అమలులోకి వచ్చింది. 1986లో మండల వ్యవస్థ ఏర్పాటయ్యాక ప్రత్యక్ష ఎన్నికల విధానాన్నే కొనసాగించా రు. అప్పటివరకు రొటేషన్ లేకపోయినా, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు రిజర్వేషన్ దక్కింది. అయితే 1992లో చేపట్టిన పంచాయతీరాజ్ సంస్కరణల్లో భాగంగా 73, 74 రాజ్యాంగ సవరణల మేరకు ఐదంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైంది. ఉమ్మడి ఏపీలో దీనికి కొనసాగింపుగా అప్పటి మంత్రివర్గ సబ్‌కమిటీ సూచనల మేరకు బీసీ, మహిళా రిజర్వేషన్లను పంచాయతీలకు అమలు చేశారు. ఈ రిజర్వేషన్లతో 1995లో ఎన్నికలు నిర్వహించి అప్పటి నుంచి రిజర్వేషన్ సైకిల్‌ను మళ్లీ కొత్తగా ప్రారంభించారు. అప్పటి నుంచి రొటేషన్ పద్ధతిలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు మారుస్తూ ఉండాలని నిర్ణయించారు. అప్పటి నుంచి వరుసగా 2014 వరకు అదే నిబంధనల ప్రకారం రొటేషన్ విధానాన్ని పాటించారు. ఐదు పర్యాయాలు రొటేషన్ విధానంలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపులు చేయగా, ఆ ఐదు పర్యాయాల్లోనూ సర్పంచ్ పదవులకు ఎస్సీ రిజర్వేషన్లు దక్కని గ్రామాలు ఉన్నాయి. అదే రొటేషన్‌ను 2019లో పాటించి ఉంటే ఎస్సీలకు అవకాశం దక్కేది. కానీ, 2018లో పాత రిజర్వేషన్ల విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం రద్దుచేయడంతో మళ్లీ మొదటికొచ్చింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామపంచాయతీల పునర్విభజన చేపట్టడంతో పాటు, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనూ 100శాతం గిరిజనులుండే తండాలు, గూడేలను ప్రత్యేక ఎస్టీ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా నాలుగైదు ఆవాస గ్రామాలను విభజించి అదనపు పంచాయతీలు ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు, చేర్పులతో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని, రిజర్వేషన్ల విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీంతో అప్పటి నుంచి మళ్లీ కొత్త రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు, మళ్లీ అధిక జనాభా గ్రామాలకు మొదటి అవకాశం ఇస్తూ రిజర్వేషన్లు కేటాయించారు. దీంతో ఎస్సీ జనాభా పరిమితంగా ఉన్న కొన్ని గ్రామాలకు 2019 ఎన్నికల్లోనూ సర్పంచ్‌లుగా అవకాశం దక్కలేదు. ఆ రిజర్వేషన్లనే రొటేషన్

- మిగతా 8వ పేజీలో...

అసిస్టెంట్ ప్రొఫెసరా.. మజాకా!

- శిక్షణ పేరుతో విద్యార్థుల నుంచి వసూళ్లు
- రూ.4.24లక్షలతో ఉడాయింపు
- నెల రోజులుగా పరారీలో



నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొన్ని నెలలుగా ఎలాంటి సెలవులు పెట్టకుండా విధులకు గైర్హాజరవడమేగాక పరారీలో ఉన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ బీటెక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఎంజీయూ అధికారులు ఒప్పందం చేసుకున్న తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)కు సంబంధించిన శిక్షణ తరగతులను ఎంజీయూ లో నిర్వహించేందుకు విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేశాడు. ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.1,000, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.750, తృతీయ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.500, నాలుగో సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.250 చొప్పున వసూలు చేశాడు. నిబంధనల మేరకు నామమాత్రపు ఫీజు వసూలు చేయాల్సి ఉండగా, అంతకు మించి విద్యార్థుల నుంచి నగదు వసూలు చేశారు. ఈ తతంగమంతా ఆగస్టు నుంచి నడుస్తుండగా, వసూలు చేసిన సదరు ఫీజును యూనివర్సిటీ ఖాతాలో జమ చేయలేదు. సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు ఆడే వ్యసనంతో అప్పులు చేసినట్లు చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే విద్యార్థుల నుంచి వసూలుచేసిన సుమారు రూ.4.24లక్షలను యూనివర్సిటీ ఖాతాలో జమచేయకుండా నెల రోజులుగా పరారీలో ఉన్నారు. అతడిపై ఎంజీయూ అధికారులు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో యూనివర్సిటీ అధికారులు అతడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయగా, వారు డబ్బు చెల్లింపునకు ముందుకు రాలేదని తెలిసింది. అయితే అన్ని వైపుల నుంచి ఒత్తిడి రావడంతో సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ సోమవారం యూనివర్సిటీలో ప్రత్యక్షమయ్యాడు. అతడి వెంట స్నేహితులు, బంధువులు వచ్చి రూ.లక్ష వరకు ముందుగా చెల్లించి మిగతా డబ్బును ఈనెల 10వ తేదీలోగా విడతల వారీగా చెల్లిస్తామని అధికారులకు అంగీకారపత్రం రాసిచ్చారు. ఈ విషయంపై ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన ధ్రువీకరించారు. నెలరోజులుగా అతడు విధులకు రావడం లేదని, విచారణకు కూడా ఆదేశించామన్నారు. సోమవారం రూ.లక్ష చెల్లించారని, మిగతా డబ్బును ఈనెల 10లోగా చెల్లించకపోతే శాఖాపర చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దామరచర్లలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దామరచర్ల, పెద్దవూర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం దామరచర్ల, పెద్దవూర మండల కేంద్రాల్లోని క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీచేశారు. ఇప్పటివరకు వచ్చిన నామినేషన్లు, హెల్ప్ డెస్క్, తదితర అంశాలను పరిశీలించారు. వచ్చిన నామినేషనన్లు ఎప్పటికప్పుడు స్కాన్ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలని, వాటి వివరాలను సకాలంలో డీపీవో కార్యాలయానికి పంపాలన్నారు. టీ-పోల్‌లో సైతం అప్‌లోడ్ చేయాలని సూచించారు.నామినేషన్ స్వీకరించే గదిలో డిజిటల్ క్లాక్, 100మీటర్ల పరిధిలో బందోబస్తు, ఓటరు జాబితా ప్రచురణ తదితర అంశాలను పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో రాము, ఆర్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం పెద్దవూర మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. అభ్యర్థులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో ఓటర్లు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రచారం నిర్వహించాలని,వ్యక్తిగత దూషణలకు దిగవద్దన్నారు. పట్టణాల్లో ఉన్న కొంతమంది గ్రామాలకు వచ్చి లేనిపోని మాటలతో ఘర్షణలు పెట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనివాస్,ఎస్‌ఐ ప్రసాద్,ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ శ్రీదేవి పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచేశారు

- బోర్డు తిప్పేసిన 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్
- నల్లగొండ జిల్లాకేంద్రంలో బాధితుల ఆందోళన
- రూ.4లక్షలు చెల్లిస్తే నెలకు రూ.16వేల వడ్డీ, గుంట భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని మోసం
- పోలీసుల అదుపులో సంస్థ లీగల్ అడ్వైజర్
- ఉమ్మడి జిల్లాలో 300మందికి పైగా బాధితులు



నల్లగొండలో ఆందోళన నిర్వహిస్తున్న 12వెల్త్ క్యాపిటల్ బాధితులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వారంతా మధ్య తరగతి కుటుంబీకులు. అధిక వడ్డీకి ఆశపడ్డారు. ఓ సంస్థ ఏజెంట్లు, డైరెక్టర్‌లు, నిర్వాహకుల మాటలు నమ్మి ఉన్న ప్లాట్‌లు, ఇతర ఆస్తులు, బంగారాన్ని విక్రయించి అందులో పెట్టుబడులు పెట్టారు. రూ.4లక్షలు పెట్టుబడి పెడితే గుంట భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు నెలకు రూ.16వేల వడ్డీ వస్తుందని, 25 నెలల తర్వాత రూ.4లక్షలకు మరో రూ.4లక్షలు కలిపి మొత్తంగా రూ.8లక్షలు చెల్లిస్తామంటే నమ్మారు. సదరు సంస్థ తమను నమ్మించి నట్టేట ముంచిందని ఆవేదన చెందారు. నమ్మబలికి పెట్టుబడి పెట్టించిన వారు ముఖం చాటేయడంతో విసిగి వేసారి రోడ్డు ఎక్కారు. హైదరాబాద్ కేంద్రంగా కూకట్‌పల్లిలో 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన కొందరు వైట్ కాలర్ నేరానికి తెరతీశారు. రెండు సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమాయక ప్రజలకు టోకరా వేసి రూ.330కోట్లకు పైగా స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇదే సంస్థపై సైబరాబాద్ పరిధిలో ఎకనామిక్ అఫెన్స్ వింగ్(ఈవోడబ్ల్యూ)లో కేసు నమోదైంది.

ఈ సంస్థ బాధితులు నల్లగొండ జిల్లాకేంద్రంలో కూడా ఉన్నారు. సోమవారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో సదరు సంస్థకు లీగల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్న రాపోలు ప్రకాష్ ఇంటి ఎదుట బాధితులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వడ్డీ కూడా రావడం లేదని తమకు డబ్బులు ఇప్పించాలని బాధితులు కొంత కాలంగా ప్రకాష్‌ను అడుగుతున్నారు. దీనికి తోడు గుంట భూమి రిజిస్ట్రేషన్ చేసినా, స్థలం చూపించాలని పదేపదే అడిగినా ఆయన సమాధానం దాటవేసినట్లు తెలిసింది. దీంతో బాధితులు విసిగి ఆయన ఇంటి ఎదుట ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి ప్రకాష్‌ను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆందోళనకారులు కూడా సాయంత్రం వరకు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కేసు అయినందున అక్కడికే వెళ్లాలని టూటౌన్ పోలీసులు సూచించినట్లు తెలిసింది. దీంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులే కేసును తీసుకొని విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని..

ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ నిర్వాహకులు నిలువునా మోసం చేయడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని నమ్మబలికి భూమి రిజిస్ట్రేషన్ కూడా చేస్తామనడంతో చాలా మంది ఆశపడ్డారు. దీంతో పెద్దఎత్తున అప్పులు చేయడం, ఆస్తులు, బంగారం విక్రయించి సైతం పెట్టుబడులు పెట్టారు. చాలా మందికి వడ్డీ రాకపోవడంతో పాటు గుంట భూమి ఎక్కడ ఉందో చూపించాలని చెప్పినా వారు భూమి చూపించలేదు. సంగారెడ్డి జిల్లా ఆంథోల్ మండలం రాంసాగర్ పల్లిలో ఉన్న భూములకు బై నెంబర్లు వేసి రూ.వంద బాండ్ పేపరుపై గుంట భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా అగ్రిమెంట్ ఇచ్చినట్లు తెలిసింది. అవి నకిలీ అగ్రిమెంట్‌లేనని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలో బాలాజీ నాయక్ అనే వ్యక్తి అధిక వడ్డీ పేరిట మోసం చేసిన ఘటన మరువకముందే మరొక భారీ మోసం వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్‌లో బాధితుల్లో కొంత మంది అధికారులు, ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థలో పెద్ద ఎత్తున ఏజెంట్లు చేరి మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఒకరి ద్వారా ఒకరు చైన్ పద్ధతిలో పరిచయాలు పెంచుకొని అమాయకులను ఈ ఉచ్చులోకి లాగినట్లు సమాచారం. డబ్బులు దాచుకుంటే ఉపయోగం ఉండదని, వాటిని ఎక్కడో ఒక చోట పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతుందని 12 వెల్త్‌కు సంబంధించిన క్యాపిటల్ సర్వీసెస్ బ్రోచర్‌లను చూపించి వారి సొమ్మును తమ కంపెనీలకు పెట్టుబడులుగా పెట్టుకొని నిలువున దోచేశారు. కొంతమంది తమ పిల్లల పెళ్లిళ్ల, చదువుల కోసం సదరు సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయామని తెలియడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నల్లగొండ పోలీసులు మాత్రం సదరు సంస్థ హైదరాబాద్‌లోనే ఉందని అక్కడ ఇప్పటికే ఈవోడబ్ల్యూలో కేసు ఉన్నందున అక్కడికే వెళ్లాలని చెప్పడంతో నష్టపోయిన బాధితులకు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి



నాంపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నాంపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని నాంపల్లి సీఐ రాజు అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలకేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి, ఓటర్లలో విశ్వాసం నింపడానికి కవాతు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మర్రిగూడ ఎస్‌ఐ కృష్ణారెడ్డి, చింతపల్లి ఎస్‌ఐ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కొండమల్లేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, మందుల గదిలో నిల్వ ఉన్న మందులు, ఓపి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు.పల్లె దవాఖానాలో పరిశుభ్రంగా ఉంచుకొని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరకొండలో 6న సీఎం పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



దేవరకొండలో సీఎం సభ, హెలీప్యాడ్ స్థలాలను పరిశీలిసున్న కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈ నెల 6న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు బహిరంగసభలో మాట్లాడనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సభా స్థలం, హెలీప్యాడ్ ఏర్పాటుకు పట్టణంలోని ముదిగొండ రోడ్డు, ఎంకేఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అందుకు లోబడి అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించవద్దన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని ముదిరాజు సంఘం దేవరకొండ మండల అధ్యక్షుడు రసమళ్ల నాగయ్య అన్నారు. సోమవారం దేవరకొండలో తెలంగాణ ఉద్యమకారుడు పోలీస్ కృష్ణయ్య 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కృష్ణయ్య పోరాడి అమరుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు రెడ్డిశంకర్, పంగ అజయ్, కొప్పెర శ్రీను, జింకల మధు, నీల వెంకటయ్య, రాంబాబు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ముదిరాజు సంఘం నాయకులు

ప్రతీ ఆదివారం బుద్ధవనంలో ధ్యాన శిక్షణ

రెండు విడతలుగా నిర్వహణ

నాగార్జునసాగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో ప్రతీ ఆదివారం ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధవనం మహాస్తూపం అంతర్భాగంలో ధ్యాన మందిరంలో దమ్మ నాగార్జున విపశ్యన కేంద్రం వలంటీర్లతో ఈ ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 11.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 3.30 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఒక్కో విడతలో 1000 మంది వరకు ధ్యాన శిక్షణలో పాల్గొనవచ్చని, ఇందుకోసం ముందుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆసక్తి ఉండి ఆ సమయానికి వచ్చిన వారిని ధ్యాన శిక్షణకు అనుమతిస్తామన్నారు. ధ్యాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే వారు వారికి కేటాయించిన సమయంలో ధ్యాన మందిరంలోకి చేరుకుని ధ్యానం ముగిసే వరకు ఉండాలన్నారు. ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సమయంలో మహాస్తూపం లోపలకు పర్యాటకులకు అనుమతి లేదన్నారు. ఈ ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నిలిచిన అంబాభవానీ ఎత్తిపోతల పంప్‌హౌస్ పనులు

సీఎం సారూ.. ఇటు చూడరూ

- 20ఏళ్లుగా లైనింగ్ పనులకు నోచని ఏఎమ్మార్పీ
- ముందుకుసాగని ఎత్తిపోతల పనులు
- సీఎం పర్యటనతోనైనా ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా ?

7

● అయ్యప్ప మాలధారుల గిరి ప్రదక్షిణ



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు సామూహిక గిరిప్రదక్షణ నిర్వహించారు. సోమవారం రాష్ట్ర నలుమూలల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నృసింహుడి శరణఘోషతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అయ్యప్ప మాలధారులైన గోమాత గురుస్వాములు, కన్య స్వాములకు దేవస్థానం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసింది.

యాతవాకిళ్ల.. ఆ కుటుంబానిదే హవా

● ఒకే కుటుంబం నుంచి నలుగురు సర్పంచ్‌లు

● 23 ఏళ్ల పాటు వారి పాలనలోనే గ్రామం

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ 1988 నుంచి సర్పంచ్‌లుగా ఎన్నికైన వారిలో రిజర్వేషన్ మినహాయిస్తే మిగతా సమయాల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సర్పంచులుగా కొనసాగారు. కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు కోలహలం పున్నంరాజు మృతితో ఆయన భార్య విశాలాంధ్ర 1988 ఎన్నికల్లో హనుమంతులగూడెం, యాతవాకిళ్ల ఉమ్మడిగా ఉన్న పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎన్నికైన ఏకైక మహిళ ఆమె. అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ గ్రామ పాలనలో తనదైన ముద్ర వేసి అధికారులతో పాటు గ్రామస్థుల మన్ననలు పొందారు. ప్రధానంగా డ్రైనేజీలు, అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టి తాగునీటి కోసం ప్రతి వీధిలో జీఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మించారు. చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు ఆమె హయంలోనే జరిగింది. ప్రస్తుతం హనుమంతులగూడెం, యాతవాకిళ్ళ రెండు పంచాయతీలుగనా కొనసాగుతున్నాయి. అయితే ఆమె స్ఫూర్తితోనే ఇద్దరు కుమారులు, కోడలు సర్పంచ్‌లుగా సేవలు అందించారు. కోలహలం విశాలాంధ్ర 1988 నుంచి 1995 వరకు ఏడేళ్ల సర్పంచిగా పనిచేయగా ఆమె పెద్ద కుమారుడు కోలహలం కృష్ణంరాజు 1995 నుంచి 2000 వరకు, కోడలు కృష్ణంరాజు సతీమణి కోలహలం పద్మ 2000 నుంచి 2005 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తరువాత వరుసగా రెండుసార్లు సర్పంచ్ స్థానం ఎస్టీ, ఎస్సీలకు కేటాయించడంతో వీరికి అవకాశం లేకుండాపోయింది. తిరిగి 2019 బీసీ జనరల్ కావడంతో ఆ ఎన్నికల్లోనూ విశాలాంధ్ర చిన్నకుమారుడు లక్ష్మీనరసింహారాజు సర్పంచ్‌గా గెలుపొందారు. కాగా ప్రస్తుతం యాతవాకిళ్ల సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించారు. మొత్తంగా కోలహలం పున్నంరాజు కుటుంబ సభ్యులు 1988 నుంచి వివిధ సందర్భాల్లో 23 ఏళ్ల పాటు సర్పంచ్‌లుగా సేవలందించారు.



విశాలాంధ్ర(రౌండప్‌లో)తో కుమారులు, కోడలు

వస్తే సర్పంచ్ పదవి.. పోతే ఎకరం




● పైసలుంటేనే పంచాయతీ బరిలో..

● జనరల్ స్థానాల్లో రూ.10 నుంచి రూ.25 లక్షలు

● రిజర్వుడ్ స్థానాల్లో రూ.10 లక్షల వరకు


(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

పంచాయతీ ఎన్నికలను పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. డబ్బులు ఖర్చు పెట్టేవారినే సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉంచేందుకు పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. దీంతో ఖర్చు భరించేవారినే అభ్యర్థులుగా ఎంపిక చేసే యోచనలో ఉన్నారు. పార్టీలలో క్రియాశీలకంగా పనిచేస్తూ పోటీ చేయాలని ఉత్సాహం,ఆసక్తి ఉన్న వారికి సైతం సరైన ఆర్థిక స్థోమత లేకపోతే అభ్యర్థులుగా అవకాశం కల్పించే పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామానికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ డబ్బు లేకపోతే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితులు లేవు. సామాజికవర్గం సమీకరణలు, ప్రజాదరణతో పాటు ఆర్థిక బలం ఉన్న వారిని అన్వేషిస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో 29 పంచాయతీలు ఉండగా, ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు ఆరు, బీసీలకు ఏడు పంచాయతీలు రిజర్వు కాగా మిగతా 15 పంచాయతీలు జనరల్‌కు కేటాయించారు. ముఖ్యంగా జనరల్, బీసీ స్థానాల్లో పోటీకి తీవ్ర పోటీ ఉంది. ఎంత ఖర్చయినా కొందరు వెనుకాడటం లేదు. ఆశావహులు తమ అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే గ్రామాల్లో ప్రతిరోజూ వేలల్లో ఖర్చు చేస్తున్నారు. సమావేశాలు పెడుతూ తనకే మద్దతు ఇవ్వాలని కోరుతూ ఖర్చు పెడుతున్నారు. జనరల్ పంచాయతీల్లో రూ.10 నుంచి రూ.25 లక్షలు, అదేవిధంగా రిజర్వుడ్ పంచాయతీల్లో కనీసం రూ.10 లక్షలు ఖర్చు పెట్టేవారికి అవకాశం ఇవ్వాలని పార్టీల నాయకులు చూస్తున్నారు. ఆయకట్టు గ్రామాల్లో సర్పంచ్ పదవికి ఎక్కువ డిమాండ్ ఉంది. అక్కడ రూ.50 లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారు. కొన్నిగ్రామాల్లో రూ.25నుంచి రూ.40లక్షలు ఖర్చు చేసేందుకు సిద్ధమే అంటున్నారు. వస్తే సర్పంచ్ పదవి..పోతే ఎకరం భూమి అంటూ బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



సంగ్రామం

మంచి ముహూర్తం.. చూడు పంతులూ..



(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

గ్రామపంచాయతీ ఎన్నికల సంగ్రామంలో రెండోవిడత నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగియనుంది. మూడోవిడతకు సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభం అవుతాయి. చివరివిడతలో ఉన్న సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఆశావహులు సెంటిమెంట్లకు పదునుపెట్టారు. సర్పంచ్, వార్డుస్థానాలకు పోటీ చేసే వారు తమ నామినేషన్లు ఏ శుభఘడియల్లో వేయాలని ఆరా తీస్తూ పురోహితులను ఆశ్రయిస్తున్నారు. మూడోవిడతలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషన్ల పర్వం కొనసాగనుంది. అందులో 3వ తేదీ త్రయోదశితో పాటు బుధవారాన్ని శుభకరంగా భావిస్తారు. అదేవిధంగా 4వ తేదీ దత్తాత్రేయ జయంతి ఉన్నా చతుర్థశితో పాటు యుక్తపౌర్ణమితో అంతగా యోగ్యమైన ముహూర్తంగా భావించరు. ఇక 5వ తేదీ లక్ష్మీవారమైన శుక్రవారంతో పాటు పాడ్యమి తిథి కావడంతో శుభముమూర్తంగా పండితులు చెబుతున్నారు. దీంతో మూడో విడతలో చివరిరోజు నామినేషన్లు ఎక్కువసంఖ్యలో వేసే అవకాశాలు ఉన్నాయి.

రాశి, నక్షత్రాల ఆధారంగానే..



నామినేషన్లు వేసేందుకు శుభఘడియలు ఆయా అభ్యర్థి రాశి, నక్షత్రాల ఆధారంగా నిర్ణయించబతాయి. అభ్యర్థులందరికీ ఒకే రకమైన ముహూర్తాలు ఉండవు. వారి నక్షత్రాలను అనుసరించి శుభగడియ నిర్ణయిస్తాం. ముహూర్తబలం ఒకవైపు దైవబలం ఇంకో వైపు జాతక బలంతో పాటు దైవబలం తోడైన వారికి విజయం వరిస్తుంది. అభ్యర్థుల బలాన్ని బట్టి నామినేషన్ వేస్తే కీడు తొలగి మంచి జరిగి ఫలితం వస్తుంది.

మార్తి రమణశాస్త్రి, పురోహితుడు, మఠంపల్లి

ఆలయ నిర్మాణం కోసం తీర్మానం

● చొప్పరివారిగూడెంలో సర్పంచ్ పదవి వేలం

● రూ.18.16 లక్షలకు దక్కించుకున్న కాంగ్రెస్ మద్దతుదారు

చండూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలంలో మరో గ్రామపంచాయతీ ఏకగ్రీవమైంది. చొప్పరివారిగూడెం సర్పంచ్ పదవి కోసం గ్రామపెద్దలు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ.18.16 లక్షలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థి జాల వెంకన్నయాదవ్ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసుకున్నాడు. సర్పంచ్ పదవికి ఐదుగురు నామినేషన్ దాఖలు చేయగా వేలం పాటలో నలుగురు పాల్గొన్నారు. ఒకరు అందుబాటులో లేరు. ఏదిఏమైనా ఒకవేళ అతడు పోటీలో ఉన్నా సరే గ్రామస్థులంతా ఏకమై ఏకగ్రీవంగా వెంకన్నను గెలిపించుకోవాలని తీర్మానించారు. వేలం పాట ద్వారా సమకూరిన డబ్బుతో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించుకోవాలని గ్రామస్థులు తీర్మానించారు.

ఆ దంపతులు గ్రామానికి నిర్మల్ అవార్డు తెచ్చిపెట్టారు

స్ఫూర్తి





జటంగి శంకర్, లక్ష్మి

శాలిగౌరారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామాంజపురం గ్రామంలో భార్యభర్తలు సర్పంచ్‌లు గెలిచి వారి హయాంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. 791 ఓటర్లు కలిగిన ఈ గ్రామంలో 411 పురుషులు, 380 మహిళా ఓటర్లు ఉన్నారు. గ్రామానికి 2006 నుంచి 2011 వరకు గ్రామానికి చెందిన జటంగి లక్ష్మి సర్పంచ్‌గా పనిచేశారు. ఈ హయాంలో కేంద్ర ప్రభుత్వం గ్రామానికి నిర్మల్ పురస్కార్ అవార్డు ప్రకటించగా మహారాష్ట్ర రాష్ట్రం పుణెలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ఆమె అందుకున్నారు. లక్ష్మి భర్త జటంగి శంకర్ కూడా 2019 నుంచి 2024 వరకు సర్పంచ్‌గా చేశారు. భార్యాభర్తలిద్దరూ సర్పంచులుగా ఎన్నికై గ్రామంలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేశారు. గ్రామాన్ని జాతీయ స్థాయిలో నిలిపి అవార్డు రావడానికి శ్రమించారు.

రోడ్డేస్తేనే ఓటేస్తాం

● వాట్సాప్‌లో ఫ్లెక్సీ హల్‌చల్

● వేములపల్లి ఎన్ఎస్పీ కాలనీవాసుల వినూత్న నిరసన

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

తమ కాలనీకి సర్వీస్ రోడ్డు వేస్తేనే ఓటు వేస్తాం.. లేదంటే ఓటింగ్‌ను బహిష్కరిస్తామంటూ ఫ్లెక్సీ వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. నల్లగొండ జిల్లా వేములపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్ఎస్పీ క్యాంప్ కాలనీకి రాకపోకలు సాగించాలంటే వేములపల్లి మండల కేంద్రం నుంచి నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకోని ప్రాణాలు కోల్పోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు గ్రామ ప్రజాప్రతినిధులు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామంలో జరగబోయే ఎన్నికలను పూర్తిగా బహిష్కరిస్తామంటూ ఎన్ఎస్పీ కాలనీ ప్రజలు వాట్సాప్ గ్రూపులో షేర్ చేస్తున్నారు. దీంతో పలు రాజకీయ పార్టీల నాయకులు కాలనీవాసులను నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామంలోని ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు వేయిస్తామని హామీ ఇస్తే తప్పా ఓట్లు వేసేది లేదని పేర్కొంటున్నారు.



వాట్సాప్‌లలో వైరల్ అవుతున్న ఫ్లెక్సీ పోస్టర్

అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు డిపాజిట్

● ఏకగ్రీవం చేస్తే మరో రూ.10 లక్షలు

కోదాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో సర్పంచ్ పదవికి తనను ఏకగ్రీవం చేయాలని ఓ వ్యక్తి ముందస్తుగా రూ.50 లక్షలు డిపాజిట్ చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం నల్లబండగూడెం సర్పంచ్ పదవికి తనను ఏకగ్రీవం చేయాలని అల్సకాని భవానీశరబయ్య కోరారు. ఏకగ్రీవం చేసినట్లయితే గ్రామ అభివృద్ధి కోసం రూ. 60 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, ఇప్పటికే గ్రామపెద్దల సమక్షంలో రూ. 50 లక్షలు డిపాజిట్ చేశానన్నారు. పోటీ లేకుంటే మరో రూ.10 లక్షలు మొత్తం రూ.60లక్షలను గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తానన్నారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు.

నామినేషన్ తిరస్కరణపై ఆందోళన

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ల తిరస్కరణకు కారణం చెప్పకపోవడంతో అభ్యర్థులు ఆందోళన బాటపట్టారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో సోమవారం ఆందోళన చేశారు. మొదటి విడతలో భాగంగా మం డలంలోని సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ నవంబరు 29వ తేదీతో ముగిసింది. 30వ తేదీన నామినేషన్లను పరిశీలించాల్సిన అధికారులు అర్ధరాత్రి దాకా పరిశీలన చేసి పలు కారణాలు చూపించి కొంతమంది నామినేషన్లలో తప్పులు ఉన్నాయని తిరస్కరించారు. అయితే సోమవారం తిరస్కరణకు గురైన నామినేషన్ పత్రాలను ఆర్డీవోకు అప్పీలు చేసుకోవాలని చెప్పడంతో బాధితులు నామినేషన్ల క్లస్టర్ కార్యాలయాల ముందుకు చేరుకున్నారు. నామినేషన్లలో ఏమి ఉన్నాయో తెలపాలంటూ రిటర్నింగ్ అధికారులను కోరారు. వారు తాము ఏం చెప్పమని ఆర్డీవో వద్ద దరఖాస్తు చేసుకోవాలని సమాధానం చెప్పారు. దీంతో తప్పేంటో చెప్పకుండా ఆర్డీవోకు ఎలా అప్పీలు చేసుకోవాలంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు, అభ్యర్థులకు మధ్య కొంత సమయం వరకు వాగ్వాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న మండల అధికారులు ఎంపీడీవో హసీం, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ ఇరుపక్షాలకు సర్దిచెప్పి నామినేషన్లలో జరిగిన తప్పులను బాధిత అభ్యర్థుల ముందు రిటర్నింగ్ అధికారికి చదవి వినిపించారు. దీంతో ఆందోళన విరమించి ఆర్డీవోకు అప్పీలు చేసుకోవడానికి సూర్యాపేట తరలివెళ్లారు.





పాతర్లపహాడ్‌లో ఆందోళన చేస్తున్న నామినేషన్ తిరస్కరణకు గురైన వ్యక్తులు, వివరాలు వెల్లడిస్తున్న అధికారి

భారీగా నామినేషన్ల తిరస్కరణ

మండలంలో 30 గ్రామాలు, 274 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ స్థానాలకు 290 మంది, వార్డుసభ్యలకు 795మంది నామినేషన్లు దాఖాలు చేశారు. కాగా ఆదివారం వాటిని పరిశీలించిన అధికారులు 37మంది సర్పంచ్ అభ్యర్థులు, 72 మంది వార్డుసభ్యల నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్ రద్దయిన వారు ఆర్డీవోకు అప్పీలు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఎన్నికల్లో బెదిరింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్యే

నకిరేకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నకిరేకల్ నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ ఏకగ్రీవం చేసేందుకు నిరంకుశత్వంతో ప్రయత్నిస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయపార్టీల నాయకులు ఎవరూ పోటీలో ఉండకూడదన్న ధోరణితో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వీరేశం తన పదవికి రాజీనామా చేసి తనపై పోటీచేసి గెలిస్తే రాజకీయాలకు స్వస్తి పలుకుతానన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఏమాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, పెండెం సదానందం, రావిరాల మల్లయ్య, దైద పరమేశం, గుర్రం గణేష్, టి. ప్రభాకర్ రావు, పల్లె విజయ్, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నాగార్జునసాగర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం సాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, రవి, విజయ్, సత్యనారాయణ, రాజు, అప్పారావు, శివరాం ప్రసాద్, హరికృష్ణ శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం 580 అడుగులు

నాగార్జునసాగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 580.10 అడుగులుగా (283.3042 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,481 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దారి తప్పితే..



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా ఇది. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై పట్టణంలో వచ్చే ప్రధాన మలుపు. నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ నూతన రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎత్తుగా మట్టి పరిచి రోడ్డు నిర్మించారు. నల్లగొండ నుంచి పట్టణంలోకి వెళ్లే వాహనదారులు ఈ గడ్డమీది నుంచే ఒక్కసారిగా ఎడమ వైపుకు మళ్లాల్సి ఉంటుంది.



వాహనాలు అదుపు తప్పితే ఏమవుతుందో చెప్పడానికి మచ్చుతునక ఆదివారం రాత్రి జరిగిన సంఘటన. నల్లగొండ నుంచి నార్కట్‌పల్లికి వస్తున్న డీసీఎం అదుపు తప్పి ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లోకి దూసుకెళ్లింది. రోడ్డుపై ఉన్న దుకాణాలను ధ్వంసం చేస్తూ సెల్లార్ మెట్ల మార్గంలోకి వెళ్లి ఆగింది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందాడు. నిత్యం ఏదో వాహనం అదుపు తప్పి ముందుకు వెళ్తుందని స్థానికులు తెలిపారు.



అసంపూర్తి రోడ్డు కారణంగానే

అసంపూర్తి రోడ్డు కారణంగానే డీసీఎం ప్రమాదం జరిగింది. రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయి నల్లగొండ రోడ్డు కిందకు కావడం...విస్తరణ జరుగుతున్న రోడ్డు ఎత్తుగా ఉండటంతో పైకి ఎక్కాలంటే వాహన చోదకులు ఎక్స్‌లేటర్‌ను మరింత రైజ్ చేయాల్సి వస్తుంది. ఈ ప్రయత్నంలో అదుపు తప్పుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ధ్వంసం



భువనగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామశివారులోని త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం ప్రధాన అర్చకులు వంశీ, ఆలయానికి వెళ్లి చూడగా హుండీ తాళం ధ్వంసమై ఉండటంతో ఆలయ చైర్మన్ ఓరుగంటి నాగయ్యకు విషయం తెలపగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారం రోజులు భక్తులు సమర్పించిన హుండీలో దాదాపు రూ.1000 వరకు దొంగిలించారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైన్‌మన్‌పై విచారణ

తుంగతుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం రూ.50వేలు డిమాండ్ చేసిన లైన్‌మన్‌పై ఫిర్యాదు నేపథ్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. శనివారం గ్రామాన్ని సందర్శించారు. ఫిర్యాదుదారుడు నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించడంతో పాటు లబ్ధిదారుల కుటుంబ సభ్యులను విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీఈ తెలిపారు.

రూ.లక్ష మద్యం పట్టివేత

చివ్వెంల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాహనంలో మద్యాన్ని తరలిస్తుండగా మండల సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీసులు దురాజ్‌పల్లి వద్ద పట్టుకున్నారు. ఎస్ఐ మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం వాహనాల తనిఖీల్లో భాగంగా దురాజ్‌పల్లి వద్ద టీజీ29టీ 0002 నెంబరు గల కారు అనుమతులు లేకుండా 11 క్వార్టర్ కాటన్లను మండలంలోని మున్యానాయక్‌తండాకు తరలిస్తున్నారు. కారు డ్రైవర్ ధరావత్ సైదా, ధరావత్ నాగును విచారించగా మందును కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్ఐ వెల్లడించారు పంచనామా జరిపి మద్యాన్ని, కారును సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. సీజ్ చేసిన మొత్తంలో 528 క్వార్టర్ల బాటిళ్ల విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని తెలిపారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యాన్ని నిల్వ చేసినా, తరలించినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహేశ్వర్ హెచ్చరించారు.



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

రాష్ట్రస్థాయి పోటీలకు కబడ్డీ జట్ల ఎంపిక



సూర్యాపేట జిల్లా బాలికల కబడ్డీ జట్టు

కోదాడ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహించే 51వ తెలంగాణ రాష్ట్రస్థాయి బాలిక కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సోమవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామానరసింహారావు ప్రకటించారు. **ఎంపికైన క్రీడాకారులు..** జి. శ్రీజా, బి. లహరి, ఎం. వైష్ణవి, ఆర్. దీప్తి, బి. అక్షర, సీహెచ్ అమూల్య, ఎం. సాహితీ, టి. హర్షిత, కే. కళ్యాణి, పి. నందిని, డి. అక్షయ, ఎం. శివాని, ఎన్. శ్రీలేఖ, ఏ. దివ్య, జై. గంగోత్రి ఉన్నారు. వీరికి కోచ్‌గా టి. రమేష్‌బాబు వ్యవహరిస్తారు. నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలో డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ 51వ తెలంగాణ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ శెట్టి రామచంద్రరావు, కోశాధికారి మాతంగి సైదులు, జాయింట్ సెక్రటరీ టి. రమేష్‌బాబు, ఆరేంజ్మెంట్ కమిటీ కన్వీనర్ బసవయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా బాలికల కబడ్డీ జట్టు

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా అనుమల మండలం హాలియాలో ఈ నెల 2,3,4,వ తేదీల్లో జరిగే 51వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కే. ఆయేషా(ఆలీనగర్), ఎన్. కీర్తి (ఇబ్రహీంపేట), ఎండి.ఆఫ్ష(ఆలీనగర్), వి.సాయిఅభిజ్ఞ(తిరుమలగిరి), టి హన్సిక(తిరుమలగిరి), ఆర్. అభినయశ్రీ(కట్టంగూరు), సి. సంతోషిణి(నల్లగొండ), వి.లక్ష్మీ(పెద్దమునిగల్), ఐ.చందన(చెరుకుపల్లి), జి. అనూత్న(హాలియా), వైష్ణవి(మునుగోడు), ఏ. భవ్యశ్రీ(మదారిగూడెం), సీహెచ్.సంధ్య(దామరచర్ల), ఎన్. పావని(ఇబ్రహీంపేట), ఆర్. వాగ్దేవి(అనుముల) ఎంపికయ్యారు. కోచ్‌గా అన్వర్ ఖాన్, మేనేజర్‌గా పరమేష్ వ్యవహరిస్తారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి

వలిగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల విద్యార్థి కనకబోయిన బాలరాజు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కనగల్‌లో జరిగిన ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రహీసున్నీసా బేగం, ఉపాధ్యాయులు రాజు, లింగస్వామి అభినందించారు.



బాలరాజు

ఖోఖోలో నర్సింగ్‌బట్ల విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకున్న నర్సింగ్‌బట్ల పాఠశాల జట్టు

నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో గత నెల 28, 29 తేదీల్లో జరిగిన పీఎంశ్రీ పాఠశాలల జిల్లాస్థాయి ఖోఖో బాలికల విభాగంలో నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల పాఠశాలకు మొదటి బహుమతి లభించింది. జిల్లాలోని 24 పీఎంశ్రీ పాఠశాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఈ నెలలో హైదరాబాద్‌లో జరిగే పీఎంశ్రీ పాఠశాలల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గెలుపొందిన జట్టును ప్రధానోపాధ్యాయుడు డి. మారయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ మల్లీశ్వరి, ఉపాధ్యాయులు యాదయ్య, గోపాల్‌రెడ్డి, యాదగిరి, సైదులురావు, రవీంద్రచారి, వినోద్ కుమార్, వేణుకుమార్, రామకృష్ణ, పద్మావతి, శ్రీదేవి, వాణి తదితరులు అభినందించారు.

అండర్-19 ఖోఖో క్రీడాకారుల ఎంపిక

కనగల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కనగల్ ఎస్‌ఏవీఎం మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-19 ఖోఖో బాలబాలికల ఎంపికలు ప్రశాంతంగా ముగిశాయి. 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 12 మంది బాలికలు, 12 మంది బాలికలను రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కుంభం నర్సిరెడ్డి, తరాల జగదీష్ తెలిపారు. ఈ నెల 5, 6, 7వ తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ఉమ్మడి జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రిటైర్డ్ ఎస్‌ఐ పందుల శంకరయ్య క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో పద్మ, ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ థామసయ్య, వజియా తబ్సుమ్, పీడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

7న సైన్స్ టాలెంట్ టెస్ట్

మిర్యాలగూడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అల్లం కిరణ్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7న సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కిరణ్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2007 డిసెంబరు 13న అమెరికా లూసియానా స్టేట్ యూనివర్శిటీలో జరిగిన కాల్పుల్లో మరణించిన తెలంగాణ యువ శాస్త్రవేత్త అల్లం కిరణ్ వర్థంతి సందర్భంగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించడానికి 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ నెల 7న టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో తరగతి వారిగా టాలెంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల లోపు బైపాస్ రోడ్డులోని లోటస్ స్కూల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పాఠశాల నుంచి ఐదుగురు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని చెప్పారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేదని తెలిపారు. మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రతి సబ్జెక్ట్ నుంచి 20 మార్కుల చొప్పున పరీక్ష 60 మార్కులకు ఉంటుందని ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. డిసెంబరు 12న అల్లం కిరణ్ మెమోరియల్ అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మంచి సందేశమిచ్చారు..



'డబ్బు, మద్యానికి ఓటు అమ్ముకోము' అని ఇంటి ప్రహరీపై నినాదం రాయించి సమాజానికి మంచి సందేశం ఇచ్చారని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం మేటి చందాపురం గ్రామానికి చెందిన పగిళ్ల రామచంద్రం, జ్యోతి దంపతులను పలువురు కొనియాడారు. దంపతులను గ్రామస్థులు సోమవారం సన్మానించారు. ఓటును మద్యం, డబ్బుకు అమ్ముకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వేసుకోవాలని అన్నారు. ఈ సందేశం కనువిప్పుగా ఉందని వారన్నారు.

● ఆంధ్రజ్యోతి, మర్రిగూడ

సీఎం సారూ.. ఇటు చూడరూ

● 20ఏళ్లుగా లైనింగ్ పనులకు నోచని ఏఎమ్మార్పీ ● ముందుకుసాగని ఎత్తిపోతల పనులు ● సీఎం పర్యటనతోనైనా ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా ● 6న దేవరకొండలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల ప్రాజెక్టులతోపాటు ఎత్తిపోతల పథకం పనులకు తరచూ అంతరాయం కలుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. పలు పర్యాయాలు నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తిచేసి సాగునీరు అందించాలని ముందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 6వ తేదీన దేవరకొండలో పలు అభివృద్ధి పనులతోపాటు బహిరంగ సభ నిర్వహించనున్నారు. సీఎం రాకతోనైనా ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపు, భూపరిహారం, పునరావాసం అందుతుందన్న ఆశాభావాన్ని నియోజకవర్గ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణానికి నోచని పెండ్లిపాకల ప్రాజెక్టు

20ఏళ్లుగా మరమ్మతులకు నోచక..

2001లో ప్రారంభమైన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు 20ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టు ప్రధాన కాల్వ 133 కిలోమీటర్ల మేర ఇరువైపులా కంపచెట్లు పెరిగి కోతకు గురైంది. డిస్ట్రిబ్యూటరీలు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో నీరు వృథాగా పోయే పరిస్థితి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ మరమ్మతులకు రూ.442 కోట్లు కేటాయించారు. టెండర్లు ఖరారు చేయడంతోపాటు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీంతోనైనా పనులు వేగవంతంగా పూర్తయి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుం దని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏఎమ్మార్పీ కింద 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు పంటలకు నీరు విడుదల చేస్తున్నారు.

డిండి ఎత్తిపోతల పనులకు రూ.1800 కోట్లు కేటాయింపు

2005లో డిండి ఎత్తిపోతల పథకానికి అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాని ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లకు ఎక్కడి నుంచి నీరు ఇస్తారనేది నిర్ధారించలేదు. సరిపడా నిధులు కేటాయించకపోవడంతో రిజర్వాయర్ పనులతోపాటు భూపరిహారం, పునరావాసం ప్రక్రియ జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునరావాసం, భూనిర్వాసితులకు పరిహారం ప్రక్రియ చేపట్టింది. ఎదుళ్ల నుంచి డిండికి నీరు అందించేందుకు రూ.1800 కోట్లు కేటాయించింది.

పెండ్లిపాకలకు మోక్షం వచ్చేనా

పెండ్లిపాకల రిజర్వాయర్ ఎత్తుపెంపు, ఎస్‌ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ పనులు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. 20శాతం వరకు పనులు పూర్తిచేసి నిలిపివేశారు. కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం, పరిహారం అందాల్సిఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ఎత్తు పెంపు పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేపట్టింది. టెండర్లు ఖరారు కావలసి ఉంది.



కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరిన ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ

ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూ ప్రత్యేక దృష్టి సారించారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ప్రాజెక్టులు ముందుకు సాగలేదు. ప్రాజెక్టులను పూర్తిచేసి అన్ని గ్రామాలకు సాగునీరు అందించడమే లక్ష్యం.

● బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

తరచూ ఆగుతున్న అంభాభవాని ఎత్తిపోతల పనులు

గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి సీఎం కేసీఆర్ నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో భాగంగా రూ.585 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులకు 2021లో శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. చందంపేట మండలం పొగిళ్ల, కంభాలపల్లి, పీఏపల్లి మండలం ఏకేబీఆర్, పెద్దగట్టు, నేరేడుగొమ్ము మండలం అంభభవాని లిఫ్టు పనులు ప్రారంభించారు. కానీ ఎత్తిపోతల పనులకు అటవీశాఖ అనుమతులురాకపోవడం, తరచూ వర్షాలు కురుస్తుండడం, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఎత్తిపోతల పథకం పనులు తరచూ ఆగుతున్నాయి. మరికొన్ని ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభంకాలేదు. అటవీశాఖ అనుమతులు రావల్సి ఉంది. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే 40వేల ఎకరాల వరకు గుట్టలపై ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

అయ్యప్పస్వాముల గిరిప్రదక్షిణ

● భజనలు, కీర్తనలతో ప్రతిధ్వనించిన దివ్యక్షేత్రం ● అయ్యప్పస్వాములు దర్శించుకునేందుకు ఉభయ దర్శనాల నిలిపివేత



గిరిప్రదక్షిణలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

యాదగిరిగుట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు సోమవారం సామూహిక గిరిప్రదక్షిణ చేశారు. ఉదయం ఆరు గంటలకు వైకుంఠద్వారం వద్ద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బసర పీఠాధిపతి గురుస్వామి వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేసి పూజారులు హారతి నివేదించగా ప్రదక్షిణను ప్రారంభించారు. అయ్యప్ప పల్లకి, గోమాతతో స్వాములు ముందుకు కదిలారు. దారి పొడవునా అయ్యప్ప, లక్ష్మీనరసింహ స్వాములను స్తుతిస్తూ ముందుకు సాగారు. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45నిమిషాల్లో మధ్యాహ్నం వరకు సుమారు 25వేల స్వాములు గిరిప్రదక్షిణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన స్వాములతో వైకుంఠద్వారం(కూడలి) నిండిపోయింది. ప్రదక్షిణ పూర్తి చేసుకున్న అయ్యప్పలు సమూహంగా మెట్ల దారిలో నల్లచీమల దండులా తూర్పు రాజగోపురం గుండా వెళ్లి గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకున్నారు. స్వాములు దర్శించుకునేందుకు ఉభయ దర్శనాలు నిలిపివేశారు. 9గంటలకు బ్రేక్ దర్శనం ప్రారంభించారు. ఉదయం 10 గంటల వరకు రూ.150 ప్రత్యేక దర్శనం, ధర్మదర్శనం భక్తులు ఉభయ క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. అయ్యప్ప స్వాములందరికీ రూ.3లక్షల విలువైన 230కిలోల లడ్డు ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయ క్యూలైన్లలో సాధారణ భక్తులు ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం(గంట ఆరగింపు) సమయాలు కలిపి మూడు గంటల పాటు వేచి ఉన్నారు. ఆదివారం రాత్రి నుంచే యాద గిరిగుట్టకు చేరుకున్న స్వాములకు కొండపైన డార్మెంటరీ హాల్, కింద పాత గోశాల డార్మెంటరీ హాల్, కల్యాణ మండపం బస చేసేందుకు కేటాయించారు. ఈవో ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ వైష్ణవ ఆలయంలోని స్వయంభువులను అయ్యప్ప మాలధారణ స్వాములు దర్శించుకోవడం శుభపరిణామమన్నారు. యాదగిరిగుట్ట ఏసీపీ పి. శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టగా పాంచరాత్రాగమన రీతిలో గంటపాటు పూజా పర్వం కొనసాగింది. కొండపై శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 24,41,558 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

చెక్కుచెదరని దీపపు స్తంభం

● మఠంపల్లిలో ఉన్న 25 అడుగుల రాతి దీపపు స్తంభం



నాగరికత ఊసే లేని నాటి రోజుల్లో ఆముదపు దీపాల వెలుగులోనే పనులు చక్కదిద్దుకునేవారు. అప్పట్లో ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. దూర ప్రాంతాలైతే ఎడ్ల బండిపై రోజుల తరబడి ప్రయాణం చేసి గమ్యస్థానానికి చేరుకునే వాళ్లు. తీర్థయాత్రలకు వెళ్లే బాటసారులు గ్రామాల్లో బస చేసేందుకు సత్రాలు ఉండేవి. వారికి తమ ఊరి ఉనికి తెలిసేలా ప్రతి పల్లెలోనూ ప్రధాన కూడలిలో రాతి దీపపు స్తంభాలు ఉండేవి. 20 నుంచి 30 అడుగుల ఎత్తులో ఉంటే ఈ స్తంభాలపై మట్టి మూకుళ్లలో ఆముదపు దీపం వెలిగించి గాలి తాకిడి లేకుండా అద్దాల కవచం పెట్టేవారు. రాత్రివేళల్లో ప్రయాణం చేసే ఈ వెలుగును చూసి దగ్గర్లో గ్రామం ఉన్నట్లు గుర్తించి అక్కడికి చేరుకునేవారు. శతాబ్దాల నాటి దీపపు స్తంభం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రంలో ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. పూర్వం గ్రామం నడిబొడ్డున ఓ రాతి దిమ్మె దానిపై 25 అడుగుల ఎత్తులో ఉన్న స్తంభం పైకి నిత్యం దీపం వెలిగించేందుకు మెట్టు ఉన్న ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయి. ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ఇప్పటికీ ఈ దీపపు స్తంభం నిలిచి ఉండడం విశేషం.

● ఆంధ్రజ్యోతి, మఠంపల్లి

మానవ సేవే మాధవ సేవ: గుట్ట ఈవో

యాదగిరిగుట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రతి ఉద్యోగి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. సోమవారం కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణలో ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా సమర్థంగా విధులు నిర్వహించారని ఎస్పీఎఫ్ సిబ్బందిని అభినందించారు. అధికారులు సమన్వయంతో సదుపాయాలు మరింత మెరుగుపర్చడం, రద్దీకి నియంత్రణ చర్యలు చేపట్టడం తదితర అంశాలపై స్పష్టంగా ఉండాలని సూచించారు. అన్నదాన సత్ర భవనంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు జూశెట్టి కృష్ణ, గజ్వేల్లి రఘు, నాగుల మహేష్‌గౌడ్, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి జాటోత్ శంకర్‌నాయక్, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు పాల్గొన్నారు.



కంట్రోల్ రూం వద్ద ఎస్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో వెంకట్రావు

యూత్ హాస్టల్‌పై నీలినీడలు

» వసతుల లేమి, అధికారుల పర్యవేక్షణ కరువు
» రెండేళ్లుగా మూతపడిన యూత్ హాస్టల్
» 22 సంవత్సరాల క్రితం ఏర్పాటైన హాస్టల్



ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ హిల్ కాలనీలో కేంద్ర ప్రభుత్వం యూత్ సర్వీసెస్, స్పోర్ట్స్ శాఖల ఆధ్వర్యంలో 22 సంవత్సరాల క్రితం యూత్ హాస్టల్ ఏర్పాటు చేసింది. మొదట్లో ఈ హాస్టల్ క్రీడాకారులు, పర్యాటకులు, యువత, విద్యార్థులతో కళకళలాడేది. తక్కువ ధరకే గదులు అద్దెకు ఇచ్చేవారు. ఒకప్పుడు కళకళలాడిన ఈ హాస్టల్ ప్రస్తుతం సందడి లేక బోసిపోతోంది. పర్యవేక్షణ, వసతుల లేమితో ఆదరణ కరువవుతోంది. రెండేళ్లుగా దీనిని కనీసం పట్టించుకునే వారు కరువయ్యారు.

\- ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా దేశంలోని పలు పర్యాటక ప్రాంతాల్లో యూత్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఉమ్మడి ఏపీకి మూడు హాస్టళ్లు మంజూరయ్యాయి. 45సంవత్సరాల హైదరాబాద్‌లో25 సంవత్సరాల క్రితం వరంగల్‌లో ఏర్పాటయ్యాయి. 22సంవత్సరాల క్రితం సాగర్ హిల్‌కాలనీలో 1997 ఏప్రిల్ 10వ తేదీన ఉమ్మడి ఏపీహోంశాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి యూత్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2003 ఏప్రిల్ 28వ తేదీన ఉమ్మడి ఏపీలో నాటి యువజన క్రీడల శాఖ మంత్రి రాములు ప్రారంభించారు.

ప్రస్తుతం మేరా యువ భారత్ నిర్వహణలో..

2016 నుంచి 2024 డిసెంబరు వరకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ హాస్టల్ 2025 నుంచి కేంద్ర ప్రభుత్వం పథకం 'మేరా యువ భారత్' పథకంలోకి మారింది. దీనికి జిల్లా కోఆర్డినేటర్‌గా హైదరాబాద్ యూత్ హాస్టల్ కో-ఆర్డినేటర్ రాజేష్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నిధులు లేక.. మరమ్మతులకు నోచక

శిథిలావస్థకు చేరుతున్న యూత్ హాస్టల్‌కు మరమ్మతులు చేయలేదు. 2015 నుంచి వాటర్ బిల్లులు చెల్లించకపోవడంతో ఎన్నెస్పీ అధికారులు కనెక్షన్ తొలగించారు. కొంతకాలం నీటి సమస్యతో ఉన్న యూత్ హాస్టల్‌కు మళ్లీ ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి నీటి కనెక్షన్‌ను పునరుద్ధరించారు. బుద్ధ వనం అధికారులతో పాటు, సాగర్ ప్రధాన డ్యాంపై విధులు నిర్వహిస్తున్న తమ వసతి భవనం కోసం యువ కేంద్రానికి అప్పగించారు. రెండేళ్లపాటు బాగానే నడిచిన హాస్టల్ 2018 నుంచి సరైన సదుపాయాలు లేకపోవడంతో పాటు, నీటి సౌకర్యం కూడా లేక ఇక్కడ అద్దె తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. 2018 నుంచి అక్కడ పనిచేసే నలుగురు ఉద్యోగులకు వేతనాలు కూడా కష్టంగా మారాయి. దీంతో ముగ్గురు ఉద్యోగులు కుటుంబాల పోషణకోసం వేరే ఉపాధి వెతుక్కున్నారు. ప్రస్తుతం కేర్ టేకర్ దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే యూత్ హాస్టల్‌ను చూసుకుంటున్నాడు. ఏడేళ్లుగా వేతనం రావడం లేదని ఆయన వాపోతున్నాడు.

ఎనిమిది డార్మిటరీలు.. వంద పడకలు

యూత్ హాస్టల్‌లో ఎనిమిది డార్మిటరీల్లో 100 పడకలు, మరో రెండు గదులు ఏర్పాటు చేశారు. 24గంటల కోసం ఒక్కోబెడ్‌కు రూ.80 అద్దె వసూలు చేస్తారు. గదికి అయితే రూ.500 వసూలు చేస్తారు. దీని నిర్వహణను మొదటి స్టెప్(సపోర్ట్ టూ ట్రైనింగ్ అండ్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రాం)కు అప్పగించారు. కేర్ టేకర్, స్వీపర్, తోటమాలి, వాచ్‌మన్‌ను దినసరి కూలీలుగా నెలకు రూ.40వేలు (నలుగురికి) వేతనాలు చెల్లించేవారు. 2015 వరకు స్టెప్ నిర్వహణలో ఉన్న యూత్ హాస్టల్‌కు 2016లో రూ. 10.86 లక్షలతో మరమ్మతులు చేయించి నెహ్రూ

కలెక్టర్‌కు లేఖలు రాస్తాం

నాగార్జుసాగర్ యూత్‌హాస్టల్ మరమ్మతులు చేసి యువతకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి లేఖ రాస్తాం. వీలైనంత త్వరలో యూత్ హాస్టల్‌ను అందుబాటులోకి తెస్తాం.

\- రాజేష్, మేరా యువ భారత్ ఇన్‌చార్జి జిల్లా కోర్డినేటర్

ఏడేళ్లుగా వేతనాలు ఇవ్వడం లేదు



2018 ఏప్రిల్ నుంచి ఏడేళ్లుగా వేతనాలు అందడంలేవు. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలి

\- దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ హాస్టల్ కేర్ టేకర్

యూత్ హాస్టల్ కావాలని గత ఏడాది సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి లేఖలు రాశారు దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోలేదు.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

ఏకగ్రీవం దిశగా సర్పంచ్ పదవులు

గ్రామాల్లో నాయకుల చర్చలు
నామినేషన్ వేసిన రెబల్ అభ్యర్థులు
మొదలైన బుజ్జగింపుల పర్వం
రసవత్తరంగా పంచాయతీ పోరు

కేతేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియడంతో గ్రామాల్లో ఇక రాజకీయం ఏకగ్రీవాల దిశగా పయనిస్తుంది. కేతేపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవుల కోసం 135 మంది నామినేషన్లు వేయగా 160 వార్డులకు 456 నామినేషన్లు వచ్చాయి. అయితే ఎలాగైనా సర్పంచ్ పదవి దక్కించుకోవాలన్న తపనతో కొందరు గ్రామాల్లో ఏకగ్రీవం చేసేందుకు యత్నిస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ నామినేషన్ ఉపసంహరణకు ఈ నెల 3వ తేదీ వరకు గడువు ఉంది. దీంతో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వేసిన వారిని ఉపసంహరింపజేసి ఆయా పదవులను ఏకగ్రీవం చేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు నానాతిప్పలు పడుతున్నారు. గ్రామ స్థాయిలోనూ ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో రాజకీయ నాయకులు చేస్తున్న యత్నాలు ఎప్పటికప్పుడు బయటకు వస్తున్నాయి. దీంతో ఉపసంహరణకు నాయకులు చేస్తున్న యత్నాలు బెడిసికొడుతున్నాయి. మండలంలోని బండపాలెం గ్రామంలో ఇదే పరిస్థితి చోటుచేసుకుంది. జనరల్ స్థానంగా ఉన్న గ్రామ సర్పంచ్, వార్డు పదవులను పంచుకుంటూ అధికార, ప్రతిపక్ష నాయకులు రాతపూర్వకంగా చేసుకున్న ఒప్పంద పత్రం బహిర్గతమైంది. దీంతో ఈ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ పదవుల పంపకానికి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది. అయినా పట్టువీడని స్థానిక నాయకులు గ్రామానికి చెందిన పలువురు వేసిన నామినేషన్లు ఉపసంహరింపజేసేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారని సమాచారం. అలాగే మూసీ నది ఒడ్డున గల ఉప్పలపహాడ్ గ్రామ సర్పంచ్ పదవి సైతం ఏకగ్రీవం చేసే యత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. రెండు రోజుల పాటు చర్చలు జరిపిన నాయకులు బీసీ మహిళకు రిజర్వు చేసిన ఈ గ్రామ సర్పంచ్ పదవికి నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన శనివారం వరకు వేచి ఉన్నారు. చర్చలు సఫలం కాకపోవడంతో చివరి రోజు సర్పంచ్ పదవికి 6 నామినేషన్లు, 8 వార్డులకు 25 మంది నామినేషన్లు వేశారు. ఆ తర్వాత సైతం ఈ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవానికి ముమ్మర యత్నాలు సాగుతున్నాయి. మరోవైపు మండలంలో రాజకీయంగా సంచలనాలకు మారుపేరుగా ఉన్న చెరుకుపల్లి సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయని తెలుస్తుంది. జనరల్ మహిళకు రిజర్వు చేసిన ఈ గ్రామ సర్పంచ్ పదవికి శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ సతీమణి నేతి కమలమ్మతో పాటు మరో 19 మంది నామినేషన్లు వేశారు. ఈ గ్రామంలోని 12 వార్డులను చెరి సగం తీసుకుని సర్పంచ్ పదవిని అధికార కాంగ్రెస్‌కు ఇచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ జరుగుతుంది. అయితే ఇదే గ్రామ సర్పంచ్ పదవికి బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ సతీమణి పోటీలో ఉండటంతో ఏకగ్రీవం కొంత కష్టతరంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా నామినేషన్ల ఉపసంహరణ నాటికి ఏకగ్రీవాల కథ ఓ కొలిక్కి వచ్చే వీలుంది.


కేతేపల్లిలోని ఓ గ్రామం

జోరుగా బుజ్జగింపుల పర్వం

సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల పరిశీలన ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి ఉపసంహరణలకై బుజ్జగింపల పర్వానికి తెరలేచింది. నామినేషన్లు వేసి పోటీలో ఉన్న రెబల్ అభ్యర్థులను పోటీ నుంచి విరమింపజేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ నామినేషన్లన్నీ సక్రమంగా ఉన్నాయని అధికారులు నామినేషన్ల స్ర్కూట్నీలో తేల్చారు. ఈ నేపథ్యంలో ఒక్కో స్థానానికి ఒకే పార్టీ నుంచి ముగ్గురు, నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో వారిని బుజ్జగించి ఉపసంహరింప జేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇందులో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల నాయకులు తలమునకలై ఉన్నాయి. పార్టీ పరంగా బీ-ఫారం లేకున్నా పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు పోటీలో ఉంటే ఓట్లు చీలి ప్రత్యర్థులకు కలిసి వస్తుందన్న ఉద్దేశంతో ఆయా పార్టీల నాయకులు బుజ్జగింపులు చేపట్టారు. ఎంత చెప్పినా కొందరు దారికి రాకపోవడంతో ఆయా పార్టీల ముఖ్య నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నామినేషన్లు వేసిన కొందరు అభ్యర్థులు తాము కూడా పోటీలో ఉంటామని భీష్మించుకుని ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ఉన్న ఈ నెల 3వ తేదీ నాటికి సాధ్యమైనంత మేర రెబల్స్‌ను పోటీ నుంచి విరమింపజేయాలనే లక్ష్యంతో ఆయా పార్టీల నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

స్నేహితురాలికి
ఆర్థిక సాయం

శాలిగౌరారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న 2002-03 బ్యాచ్‌కు చెందిన స్నేహితురాలు కూరం రేణుక అనారోగ్యానికి గురైంది. ఇటీవలే ఆమె గుండెకు స్టంట్ ఆపరేషన్ చేశారు. స్నేహితురాలు రేణుక అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న క్లాస్‌మేట్స్ సోమవారం రేణుకను పరామర్శించి రూ.30వేల ఆర్థికసాయం అందజేసి మనోధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపాక రాజు, బట్ట శ్రీనివాస్, తాందారి సోములు, రాస్తాపురం వెంకన్న, లోడే సైదులు, మీనయ్య పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలి : బీజేపీ


నార్కట్‌పల్లిలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలో అసంపూర్తిగా మిగిలిన రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయకుంటే పట్టణ ప్రజల పక్షాన ఆందోళన చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ హెచ్చరించారు. నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని ఆదివారం రాత్రి డీసీఎం బీభత్సం సృష్టించిన ఘటనా స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవడం వల్లే పట్టణంలో ప్రమాదాల సంఖ్య పెరిగి అమాయకులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నార్కట్‌పల్లిలో రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా నిలిచిపోవడం శోచనీయమన్నారు. ఎన్ని పర్యాయాలు ఎమ్మెల్యే, అధికారులకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. వెంటనే పనులు చేపట్టకపోతే అవసరమైతే అధికార పార్టీ నాయకులు, అధికారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, నడింపల్లి శ్రవణ్‌కుమార్, మునుకుంట్ల గణేశ్, నోముల నాగరాజు, బిల్లకంటి శ్రీకాంత్, వడ్డేగోని రామలింగం, ఏర్పుల పరమేశ్, పాలకూరి రమేష్, బొల్లెద్దు రామలింగం, పసునూరి సంపత్, ఉండ్రాతి అంజి, రావుల తిరుమలేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన దూదిమెట్ల సత్తయ్య

నార్కట్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్ స్థానాన్ని ఆశించిన నార్కట్‌పల్లి మాజీ జడ్పీటీసీ సభ్యుడు కాంగ్రెస్ నా యకుడు దూదిమెట్ల సత్తయ్యయాదవ్ సోమవారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తన అనుచరగణంతో బీఆర్ఎస్‌లో చేరిన దూదిమెట్ల సత్తయ్యకు మాజీ ఎమ్మెల్యే లింగయ్య గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా దూదిమెట్ల సత్తయ్య పేరును చిరుమర్తి లింగయ్య అధికారికంగా ప్రకటించారు. మాజీ సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి వెంకటేశ్వర్లు మరికొంత మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు మేకల రాజిరెడ్డి, దోసపాటి విష్ణుమూర్తి, దుబ్బాక శ్రీధర్, బొబ్బలి మల్లేశం, దేవేందర్, శ్రవణ్‌కుమార్, పరైపాటి సైదులు, జెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

కేతేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లపహాడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రలు పోషించి ఆయా పాత్రల్లో అలరించారు. విద్యాశాఖ మంత్రిగా జి.నందిని, కలెక్టర్‌గా పి.నందిని, డీఈవోగా ఐ.హారిక, పాఠశాల ప్రిన్సిపాల్‌గా వైప్రణవిలు వ్యవహరించారు. ఆయా పాత్రల్లో రాణించి విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టి.మమత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పశుసంపదను పెంచాలి

● పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి జీవీ రమేష్


పశువైద్య ఆస్పత్రిని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్

మర్రిగూ డ, డిసెంబ రు 1(ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణ ద్వారా పశుసం ప దను పెంచాలని జిల్లా పశువైద్య పశు సంవర్ధకశాఖ అధికారి జి.రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్య ఆస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా నవంబర్‌లో పశువైద్యం ద్వారా నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు గాలికుంటు టీకాలు సమర్థంగా నిర్వహించి టార్గెట్‌ను పూర్తి చేసినందుకు అభినందించారు. ఆయన వెంట మర్రిగూడ పశువైద్యాధికారి సురేందర్, అసిస్టెంట్ ఎల్లేష్ ఉన్నారు.

కిడ్నాప్ వ్యవహారం రాజకీయ డ్రామా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండలం లోని ఎల్లమ్మగూడెం సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ వ్యవహారం ఓ రాజకీయ డ్రామా అని మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కనగల్ మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మంత్రి వెంకట్‌రెడ్డి ఎక్కడ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థిని గ్రామాల్లోని వారే ఎన్నుకొని గెలిపించుకోవాలని సూచించినట్లు తెలిపారు. మంత్రి ఇప్పటివరకు నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారే తప్ప ఎలాంటి చిల్లర పంచాయితీలో జోక్యం చేసుకోలేదని అన్నారు. యాదగిరి కిడ్నాప్ వ్యవహారం రాజకీయ డ్రామా అని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఇలాంటివి చేయడం కొత్తేవి కాదని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించడంలో మంత్రి వెంకట్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. చిల్లర పంచాయితీ ల్లో తీన్మార్ మల్లన్న జోక్యం చేసుకొని మంత్రి పై ఆరోపణ చేయ డం తగదన్నారు. బీసీల పక్షాన తీన్మార్ మల్లన్న పోరాడితే తామంతా మద్దతుగా ఉంటామని, మంత్రిని విమర్శిస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ బీసీ సంఘాల నేతలు జూలకంటి శ్రీనివాస్, ప్రదీప్‌నాయక్, జెర్రిపోతుల భాస్కర్‌గౌడ్, వజ్జ రమేష్‌యాదవ్, అల్లి సుభాష్‌యాదవ్, ఇటికాల శ్రీనివాస్, పిల్లి రమేష్‌యాదవ్, గోగుల గణేష్‌యాదవ్, గోవర్ధన్‌గౌడ్, బొడ్డుపల్లి రాజేష్, బోనగిరి ప్రభాకర్, పాలకూరి శ్రీధర్, బోరిగం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు

తిప్పర్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఎల్లమ్మగూడెం బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మామిడి నాగలక్ష్మితో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిప్పర్తి మండల పరిధిలోని ఎల్లమ్మగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మామిడి నాగలక్ష్మీ భర్త యాదగిరిని రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశారని అన్నారు. కిడ్నాప్‌లో ఎవరెవరు ఉన్నారు, వారిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ఆయన ప్రశ్నించారు. యాదగిరిని ఎన్నో ఇబ్బందులు పెట్టి, చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై వెంటనే చర్యలు తీసుకొని న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీసీ నాయకులు

వారికి సర్పంచ్ పదవి దూరం

(5వ పేజీ తరువాయి)

పద్ధతిలో తాజా ఎన్నికల్లోనూ అమలు చేస్తుండడంతో 2019లో ఎస్సీలకు కేటాయించిన గ్రామాలు మినహాయించి, ఆ మండలంలో మిగిలిన గ్రామాల్లో అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం ఎస్సీ రిజర్వేషన్లు దక్కాయి. తక్కువ జనాభా ఉండి, ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ రాని గ్రామాలకు ఈ దఫా కూడా అవకాశం రాని పరిస్థితి కొనసాగింది. మొత్తంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ తరచూ రిజర్వేషన్ల అమలు విధానం మారుస్తూ వస్తుండడంతో తమ గ్రామాల్లో ఎస్సీలకు రిజర్వేషన్ అవకాశం లేకుండా పోయిందని, సర్పంచ్ అనిపించుకోవాలనే కోరిక తీరని కలగానే మిగిలిందని ఆయా గ్రామాల్లోని ఎస్సీలు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ దక్కని కొన్ని గ్రామాలు

నార్కట్‌పల్లి, నిడమనూరు, గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి, పేరేపల్లి, పలివెల, రత్తిపల్లి, చౌల్లేడు, కోతులారం, రామాంజిపురం, తుడిమిడి, కొండూరు, ఎరగండ్లపల్లి, ఖుదాబక్షపల్లి, పెద్దదేవులపల్లి, ముత్యాలమ్మగూడెం, చందంపేట, మూర్పునూతల, పులిచర్ల, ఊట్లపల్లి, వెలమగూడెం, దాచారం, ఉడతలపల్లి, అంగడిపేట, వీర్లపాలెం, పగిడిమర్రి తదితర గ్రామాలలో ప్రాధాన్య స్థాయిలో ఎస్సీ జనాభా ఉన్నా, ఆయా పంచాయతీల్లో ఇప్పటివరకు ఒక్క పర్యాయం కూడా సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వ్ కాకపోవడం గమనార్హం.

చెర్వుగట్టును సందర్శించిన
శబరి ఆలయ పూర్వ ప్రధానతంత్రి


చెర్వుగట్టులో స్వామివారిని దర్శించుకుంటున్న శబరిమల పూర్వ ప్రధానతంత్రి అరుణ్‌కుమార్

నార్కట్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టులో గల పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి శైవక్షేత్రాన్ని కేరళ ప్రసిద్ధ శబరిమల ఆలయం పూర్వ ప్రధాన తంత్రి అరుణ్‌కుమార్ ఆదివారం రాత్రి సందర్శించారు. ఆలయంలో మూలవిరాట్, ఉపాలయాలను సందర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రధాన తంత్రిని ఆశీర్వదించారు. తంత్రి వెంట గురుస్వామి గడుసు శశిధర్‌రెడ్డి, చండూరుకు చెందిన అయ్యప్ప మాల ధారులు ఉన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాకేండ్‌కుమార్

కనగల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కనగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాకేండ్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రారంభమైన ఈ కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. కళాశాల అధ్యాపకులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాకేండ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కనగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో రాజకీయం మారుతోంది. ప్రతిపక్ష పార్టీల నుంచి అధికార పార్టీలోకి నేతల వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని దర్వేశిపురం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆరెకంటి నర్సింహ తన అనుచరులతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీదేటి వెంకట్‌రెడ్డి, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి కండువాలను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల శేఖర్, కృష్ణారెడ్డి, పాపయ్య, శంకర్‌రెడ్డి, సైదులుగౌడ్, శివారెడ్డి, శివరాం, యదగిరి, సాయి, శిశుపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


ఉరుమడ్లలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న చిట్యాల పోలీసులు

చండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చండూరు ఎస్ఐ వెంకన్న హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. ప్రశాంత, స్వేచ్ఛాయుత పోలింగ్ ధ్యేయంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామంలో తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మద్యం, నగదు, బంగారం, విలువైన వస్తువులు అక్రమంగా తరలివెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు చేస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు వార్తల ప్రచారాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని, గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల కోసం వాదులాడుకోవద్దు

చిట్యాలరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినందున గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నందున ఎన్నికల కోసం గ్రామస్థులు పరస్పరం వాదులాడుకోవద్దని చిట్యాల పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్, ఉరుమడ్ల వీపీఓ నాగరాజు, కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉరుమడ్ల గ్రా మంలో సోమవారం పలుకూడళ్లలో గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు ఇప్పటి వరకు కలిసి ఉన్నారని ఎప్పుడైనా కలిసే ఉంటారని అన్నారు. ఎన్నికలు వచ్చినందున పార్టీల పేర్లు చెప్పి వాగ్వాదాలు చేసుకోవద్దని, దూషణలు చేసుకోవద్దని అన్నారు. ఎన్నికల నిబంధనలు ఉన్నందున గ్రామంలో మద్యాన్ని విక్రయించొద్దని సూచించారు. ఒకే గ్రామస్థు లు అందరూ కలిసి ఉండాలని, కేవలం ఎన్నికల కోసం ఒకరిపై మరొకరు దూఱలు, నిందలు చేసుకోవదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

చండూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీలో ఉన్న 30మంది నిరుపేదలకు గాంధీజీ విద్యాసంస్థల ఆ ధ్వర్యంలో ఉచితంగా నిత్యావసర సరుకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో ధనికులు చా లా మంది ఉంటారని, కానీ సేవా గుణం అందరికీ ఉండాలన్నా రు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24నెలలుగా పలు సేవా కార్యక్రమాల ద్వారా అభాగ్యులకు ఆసరాగా నిలుస్తున్నామన్నారు. ఎ లాంటి ఆసరాలేని నిరుపేదలను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నా రు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి పాల్గొన్నారు.




ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న అధికారులు, హాజరైన సిబ్బంది, ట్రాన్స్‌జెండర్లు, విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. ACM - 9985411394
Nalgonda ACO - 9985410334, Nalgonda-1 ACO-9985 411407, Chandur SR - 9849337588, Chityala SR - 9010198664, Nakrekal SR - 9963624250, ,Kattangoor SR - 9963624250

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	580.10 (283.3042)	37,513	37,513
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	879.08	260.19
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	2,100	2,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



స్థానిక సమరం

గ్రామపంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై 60ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఎస్సీ వర్గాలకు సర్పంచ్ పదవి తీరని కలగానే మిగిలింది. ఇప్పటివరకు 12 పర్యాయాలు సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగ్గా, ఆ గ్రామాల్లో ఎస్సీ జనాభా ఉన్నా, ఆ వర్గాలకు రిజర్వేషన్ దక్కలేదు. ఎస్సీలకు రాజ్యాంగపర రిజర్వేషన్ కల్పిస్తున్నా, రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వాలు చేస్తున్న మార్పులు, చేర్పులతో ఆ వర్గాలకు అవకాశం రావడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

వారికి సర్పంచ్ పదవి దూరం

- రిజర్వేషన్లలో తరచూ మార్పులతో చేజారుతున్న అవకాశాలు
- నార్కట్‌పల్లి, నిడమనూరు మేజర్ పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి

వరుసగా రొటేషన్ అమలుచేస్తున్నా, ప్రతీ సందర్భంలో నిబంధనలు మారడం,తదితర కారణాలతో రొటేషన్ మళ్లీ మొదటికి వచ్చి ఆ వర్గాలు అవకాశాన్ని కోల్పోతున్నాయి. జిల్లాలో నార్కట్‌పల్లి, నిడమనూరు వంటి మేజర్ పంచాయతీల్లోనూ ఇలాంటి పరిణామాలతో ఇప్పటివరకు ఎస్సీలకు సర్పంచ్ అవకాశం దక్కలేదు.

ఎన్నికలు, రిజర్వేషన్ల అమలు విధానాల్లో మార్పులతో

గ్రామపంచాయతీల పాలకవర్గాల ఏర్పాటు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు మారిన ప్రతీ సందర్భంలో పంచాయతీల్లో ఎన్నికల విధానాలు, రిజర్వేషన్ల అమలు నిబంధనలు మారుతూ వస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో ఎస్సీలకు సర్పంచ్ పదవి దక్కడం లేదు. ఎస్సీలకు రాజ్యాంగపర రిజర్వేషన్ కల్పించాల్సి ఉండడంతో పంచాయతీ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి గ్రామపంచాయతీల్లో రిజర్వేషన్లు కేటాయిస్తూ వస్తున్నారు. అయితే రిజర్వేషన్ అమలులో తరచూ మార్పులు చేస్తుండడంతో ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలకు నిబంధనలు మారిన సందర్భంలో కొన్ని వర్గాలకు తరచూ అవకాశాలు వస్తే, తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో ఇప్పటివరకు అవకాశం దక్కని పరిస్థితి నెలకొంది. 1964 నుంచి రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కొనసాగుతుండగా, గ్రామపంచాయతీలకు తొలుత వార్డు సభ్యుల ద్వారా పరోక్ష పద్ధతిలో సర్పంచ్‌ను ఎన్నుకునేవారు. 1978 వరకు ఈ విధానం కొనసాగగా, ఆ తర్వాత సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానం అమలులోకి వచ్చింది. 1986లో మండల వ్యవస్థ ఏర్పాటయ్యాక ప్రత్యక్ష ఎన్నికల విధానాన్నే కొనసాగించా రు. అప్పటివరకు రొటేషన్ లేకపోయినా, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు రిజర్వేషన్ దక్కింది. అయితే 1992లో చేపట్టిన పంచాయతీరాజ్ సంస్కరణల్లో భాగంగా 73, 74 రాజ్యాంగ సవరణల మేరకు ఐదంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైంది. ఉమ్మడి ఏపీలో దీనికి కొనసాగింపుగా అప్పటి మంత్రివర్గ సబ్‌కమిటీ సూచనల మేరకు బీసీ, మహిళా రిజర్వేషన్లను పంచాయతీలకు అమలు చేశారు. ఈ రిజర్వేషన్లతో 1995లో ఎన్నికలు నిర్వహించి అప్పటి నుంచి రిజర్వేషన్ సైకిల్‌ను మళ్లీ కొత్తగా ప్రారంభించారు. అప్పటి నుంచి రొటేషన్ పద్ధతిలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు మారుస్తూ ఉండాలని నిర్ణయించారు. అప్పటి నుంచి వరుసగా 2014 వరకు అదే నిబంధనల ప్రకారం రొటేషన్ విధానాన్ని పాటించారు. ఐదు పర్యాయాలు రొటేషన్ విధానంలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపులు చేయగా, ఆ ఐదు పర్యాయాల్లోనూ సర్పంచ్ పదవులకు ఎస్సీ రిజర్వేషన్లు దక్కని గ్రామాలు ఉన్నాయి. అదే రొటేషన్‌ను 2019లో పాటించి ఉంటే ఎస్సీలకు అవకాశం దక్కేది. కానీ, 2018లో పాత రిజర్వేషన్ల విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం రద్దుచేయడంతో మళ్లీ మొదటికొచ్చింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామపంచాయతీల పునర్విభజన చేపట్టడంతో పాటు, మైదాన ప్రాంతాల్లోనూ 100శాతం గిరిజనులుండే తండాలు, గూడేలను ప్రత్యేక ఎస్టీ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా నాలుగైదు ఆవాస గ్రామాలను విభజించి అదనపు పంచాయతీలు ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు, చేర్పులతో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని, రిజర్వేషన్ల విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీంతో అప్పటి నుంచి మళ్లీ కొత్త రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు, మళ్లీ అధిక జనాభా గ్రామాలకు మొదటి అవకాశం ఇస్తూ రిజర్వేషన్లు కేటాయించారు. దీంతో ఎస్సీ జనాభా పరిమితంగా ఉన్న కొన్ని గ్రామాలకు 2019 ఎన్నికల్లోనూ సర్పంచ్‌లుగా అవకాశం దక్కలేదు. ఆ రిజర్వేషన్లనే రొటేషన్

- మిగతా 8వ పేజీలో...

అసిస్టెంట్ ప్రొఫెసరా.. మజాకా!

- శిక్షణ పేరుతో విద్యార్థుల నుంచి వసూళ్లు
- రూ.4.24లక్షలతో ఉడాయింపు
- నెల రోజులుగా పరారీలో



నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొన్ని నెలలుగా ఎలాంటి సెలవులు పెట్టకుండా విధులకు గైర్హాజరవడమేగాక పరారీలో ఉన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ బీటెక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఎంజీయూ అధికారులు ఒప్పందం చేసుకున్న తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)కు సంబంధించిన శిక్షణ తరగతులను ఎంజీయూ లో నిర్వహించేందుకు విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేశాడు. ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.1,000, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.750, తృతీయ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.500, నాలుగో సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.250 చొప్పున వసూలు చేశాడు. నిబంధనల మేరకు నామమాత్రపు ఫీజు వసూలు చేయాల్సి ఉండగా, అంతకు మించి విద్యార్థుల నుంచి నగదు వసూలు చేశారు. ఈ తతంగమంతా ఆగస్టు నుంచి నడుస్తుండగా, వసూలు చేసిన సదరు ఫీజును యూనివర్సిటీ ఖాతాలో జమ చేయలేదు. సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు ఆడే వ్యసనంతో అప్పులు చేసినట్లు చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే విద్యార్థుల నుంచి వసూలుచేసిన సుమారు రూ.4.24లక్షలను యూనివర్సిటీ ఖాతాలో జమచేయకుండా నెల రోజులుగా పరారీలో ఉన్నారు. అతడిపై ఎంజీయూ అధికారులు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. పోలీసులు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో యూనివర్సిటీ అధికారులు అతడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయగా, వారు డబ్బు చెల్లింపునకు ముందుకు రాలేదని తెలిసింది. అయితే అన్ని వైపుల నుంచి ఒత్తిడి రావడంతో సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ సోమవారం యూనివర్సిటీలో ప్రత్యక్షమయ్యాడు. అతడి వెంట స్నేహితులు, బంధువులు వచ్చి రూ.లక్ష వరకు ముందుగా చెల్లించి మిగతా డబ్బును ఈనెల 10వ తేదీలోగా విడతల వారీగా చెల్లిస్తామని అధికారులకు అంగీకారపత్రం రాసిచ్చారు. ఈ విషయంపై ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన ధ్రువీకరించారు. నెలరోజులుగా అతడు విధులకు రావడం లేదని, విచారణకు కూడా ఆదేశించామన్నారు. సోమవారం రూ.లక్ష చెల్లించారని, మిగతా డబ్బును ఈనెల 10లోగా చెల్లించకపోతే శాఖాపర చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దామరచర్లలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దామరచర్ల, పెద్దవూర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం దామరచర్ల, పెద్దవూర మండల కేంద్రాల్లోని క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీచేశారు. ఇప్పటివరకు వచ్చిన నామినేషన్లు, హెల్ప్ డెస్క్, తదితర అంశాలను పరిశీలించారు. వచ్చిన నామినేషన్లు ఎప్పటికప్పుడు స్కాన్ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలని, వాటి వివరాలను సకాలంలో డీపీవో కార్యాలయానికి పంపాలన్నారు. టీ-పోల్‌లో సైతం అప్‌లోడ్ చేయాలని సూచించారు.నామినేషన్ స్వీకరించే గదిలో డిజిటల్ క్లాక్, 100మీటర్ల పరిధిలో బందోబస్తు, ఓటరు జాబితా ప్రచురణ తదితర అంశాలను పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో రాము, ఆర్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం పెద్దవూర మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. అభ్యర్థులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో ఓటర్లు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రచారం నిర్వహించాలని,వ్యక్తిగత దూషణలకు దిగవద్దన్నారు. పట్టణాల్లో ఉన్న కొంతమంది గ్రామాలకు వచ్చి లేనిపోని మాటలతో ఘర్షణలు పెట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనివాస్,ఎస్‌ఐ ప్రసాద్,ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి



నాంపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నాంపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని నాంపల్లి సీఐ రాజు అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలకేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి, ఓటర్లలో విశ్వాసం నింపడానికి కవాతు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మర్రిగూడ ఎస్‌ఐ కృష్ణారెడ్డి, చింతపల్లి ఎస్‌ఐ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కొండమల్లేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, మందుల గదిలో నిల్వ ఉన్న మందులు, ఓపి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు.పల్లె దవాఖానాలో పరిశుభ్రంగా ఉంచుకొని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచేశారు

- బోర్డు తిప్పేసిన 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్
- నల్లగొండ జిల్లాకేంద్రంలో బాధితుల ఆందోళన
- రూ.4లక్షలు చెల్లిస్తే నెలకు రూ.16వేల వడ్డీ, గుంట భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని మోసం
- పోలీసుల అదుపులో సంస్థ లీగల్ అడ్వైజర్
- ఉమ్మడి జిల్లాలో 300మందికి పైగా బాధితులు



నల్లగొండలో ఆందోళన నిర్వహిస్తున్న 12వెల్త్ క్యాపిటల్ బాధితులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వారంతా మధ్య తరగతి కుటుంబీకులు. అధిక వడ్డీకి ఆశపడ్డారు. ఓ సంస్థ ఏజెంట్లు, డైరెక్టర్‌లు, నిర్వాహకుల మాటలు నమ్మి ఉన్న ప్లాట్‌లు, ఇతర ఆస్తులు, బంగారాన్ని విక్రయించి అందులో పెట్టుబడులు పెట్టారు. రూ.4లక్షలు పెట్టుబడి పెడితే గుంట భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు నెలకు రూ.16వేల వడ్డీ వస్తుందని, 25 నెలల తర్వాత రూ.4లక్షలకు మరో రూ.4లక్షలు కలిపి మొత్తంగా రూ.8లక్షలు చెల్లిస్తామంటే నమ్మారు. సదరు సంస్థ తమను నమ్మించి నట్టేట ముంచిందని ఆవేదన చెందారు. నమ్మబలికి పెట్టుబడి పెట్టించిన వారు ముఖం చాటేయడంతో విసిగి వేసారి రోడ్డు ఎక్కారు. హైదరాబాద్ కేంద్రంగా కూకట్‌పల్లిలో 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన కొందరు వైట్ కాలర్ నేరానికి తెరతీశారు. రెండు సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమాయక ప్రజలకు టోకరా వేసి రూ.330కోట్లకు పైగా స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇదే సంస్థపై సైబరాబాద్ పరిధిలో ఎకనామిక్ అఫెన్స్ వింగ్(ఈవోడబ్ల్యూ)లో కేసు నమోదైంది.

ఈ సంస్థ బాధితులు నల్లగొండ జిల్లాకేంద్రంలో కూడా ఉన్నారు. సోమవారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో సదరు సంస్థకు లీగల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్న రాపోలు ప్రకాష్ ఇంటి ఎదుట బాధితులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వడ్డీ కూడా రావడం లేదని తమకు డబ్బులు ఇప్పించాలని బాధితులు కొంత కాలంగా ప్రకాష్‌ను అడుగుతున్నారు. దీనికి తోడు గుంట భూమి రిజిస్ట్రేషన్ చేసినా, స్థలం చూపించాలని పదేపదే అడిగినా ఆయన సమాధానం దాటవేసినట్లు తెలిసింది. దీంతో బాధితులు విసిగి ఆయన ఇంటి ఎదుట ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి ప్రకాష్‌ను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆందోళనకారులు కూడా సాయంత్రం వరకు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కేసు అయినందున అక్కడికే వెళ్లాలని టూటౌన్ పోలీసులు సూచించినట్లు తెలిసింది. దీంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులే కేసును తీసుకొని విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని..

ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ నిర్వాహకులు నిలువునా మోసం చేయడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని నమ్మబలికి భూమి రిజిస్ట్రేషన్ కూడా చేస్తామనడంతో చాలా మంది ఆశపడ్డారు. దీంతో పెద్దఎత్తున అప్పులు చేయడం, ఆస్తులు, బంగారం విక్రయించి సైతం పెట్టుబడులు పెట్టారు. చాలా మందికి వడ్డీ రాకపోవడంతో పాటు గుంట భూమి ఎక్కడ ఉందో చూపించాలని చెప్పినా వారు భూమి చూపించలేదు. సంగారెడ్డి జిల్లా ఆంథోల్ మండలం రాంసాగర్ పల్లిలో ఉన్న భూములకు బై నెంబర్లు వేసి రూ.వంద బాండ్ పేపరుపై గుంట భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా అగ్రిమెంట్ ఇచ్చినట్లు తెలిసింది. అవి నకిలీ అగ్రిమెంట్‌లేనని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలో బాలాజీ నాయక్ అనే వ్యక్తి అధిక వడ్డీ పేరిట మోసం చేసిన ఘటన మరువకముందే మరొక భారీ మోసం వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్‌లో బాధితుల్లో కొంత మంది అధికారులు, ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థలో పెద్ద ఎత్తున ఏజెంట్లు చేరి మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఒకరి ద్వారా ఒకరు చైన్ పద్ధతిలో పరిచయాలు పెంచుకొని అమాయకులను ఈ ఉచ్చులోకి లాగినట్లు సమాచారం. డబ్బులు దాచుకుంటే ఉపయోగం ఉండదని, వాటిని ఎక్కడో ఒక చోట పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతుందని 12 వెల్త్‌కు సంబంధించిన క్యాపిటల్ సర్వీసెస్ బ్రోచర్‌లను చూపించి వారి సొమ్మును తమ కంపెనీలకు పెట్టుబడులుగా పెట్టుకొని నిలువున దోచేశారు. కొంతమంది తమ పిల్లల పెళ్లిళ్ల, చదువుల కోసం సదరు సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయామని తెలియడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నల్లగొండ పోలీసులు మాత్రం సదరు సంస్థ హైదరాబాద్‌లోనే ఉందని అక్కడ ఇప్పటికే ఈవోడబ్ల్యూలో కేసు ఉన్నందున అక్కడికే వెళ్లాలని చెప్పడంతో నష్టపోయిన బాధితులకు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది.

దేవరకొండలో 6న సీఎం పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



దేవరకొండలో సీఎం సభ, హెలీప్యాడ్ స్థలాలను పరిశీలిసున్న కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈ నెల 6న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు బహిరంగసభలో మాట్లాడనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సభా స్థలం, హెలీప్యాడ్ ఏర్పాటుకు పట్టణంలోని ముదిగొండ రోడ్డు, ఎంకేఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అందుకు లోబడి అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించవద్దన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకటొరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని ముదిరాజు సంఘం దేవరకొండ మండల అధ్యక్షుడు రసమళ్ల నాగయ్య అన్నారు. సోమవారం దేవరకొండలో తెలంగాణ ఉద్యమకారుడు పోలీస్ కృష్ణయ్య 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కృష్ణయ్య పోరాడి అమరుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు రెడ్డిశంకర్, పంగ అజయ్, కొప్పెర శ్రీను, జింకల మధు, నీల వెంకటయ్య, రాంబాబు పాల్గొన్నారు.




నివాళులర్పిస్తున్న ముదిరాజు సంఘం నాయకులు

ప్రతీ ఆదివారం బుద్ధవనంలో ధ్యాన శిక్షణ

రెండు విడతలుగా నిర్వహణ

నాగార్జునసాగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో ప్రతీ ఆదివారం ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధవనం మహాస్తూపం అంతర్భాగంలో ధ్యాన మందిరంలో దమ్మ నాగార్జున విపశ్యన కేంద్రం వలంటీర్లతో ఈ ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 11.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 3.30 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఒక్కో విడతలో 1000 మంది వరకు ధ్యాన శిక్షణలో పాల్గొనవచ్చని, ఇందుకోసం ముందుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆసక్తి ఉండి ఆ సమయానికి వచ్చిన వారిని ధ్యాన శిక్షణకు అనుమతిస్తామన్నారు. ధ్యాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే వారు వారికి కేటాయించిన సమయంలో ధ్యాన మందిరంలోకి చేరుకుని ధ్యానం ముగిసే వరకు ఉండాలన్నారు. ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సమయంలో మహాస్తూపం లోపలకు పర్యాటకులకు అనుమతి లేదన్నారు. ఈ ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నిలిచిన అంబాభవానీ ఎత్తిపోతల పంప్‌హౌస్ పనులు

సీఎం సారూ.. ఇటు చూడరూ

- 20ఏళ్లుగా లైనింగ్ పనులకు నోచని ఏఎమ్మార్పీ
- ముందుకుసాగని ఎత్తిపోతల పనులు
- సీఎం పర్యటనతోనైనా ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా?

7

● అయ్యప్ప మాలధారుల గిరి ప్రదక్షిణ



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు సామూహిక గిరిప్రదక్షిణ నిర్వహించారు. సోమవారం రాష్ట్ర నలుమూలల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నృసింహుడి శరణఘోషతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అయ్యప్ప మాలధారులైన గోమాత గురుస్వాములు, కన్య స్వాములకు దేవస్థానం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసింది.

7

ఏకగ్రీవాల కోసం ఎత్తుగడ

రసవత్తరంగా పంచాయతీ పోరు

ఖర్చుకు వెనుకాడని వైనం

అభ్యర్థుల ఖరారులో మల్లగుల్లాలు



నిడమనూరులోని ఓ గ్రామం

నిడమనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని పలు గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రోత్సహకాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆ దిశగా పావులు కదుపుతున్నాయి. ఈనెల 14న జరగనున్న పంచాయతీలను కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులు ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు గ్రామాల్లో ఆశావహులతో చర్చలు జరుపుతున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత ఎక్కువగా ఆసక్తిగా చూపుతోంది. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా రెండు ఏకగ్రీవంగా కాగా, శాఖాపురం, వేంపాడ్, పార్వతీపురం, బంకాపురం, గుంటుకగూడెం తదితర గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాకపోతే అధికార కాంగ్రెస్ పార్టీకే పదవి దక్కాలనే షరతు విధిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో ఏకగ్రీవ యత్నాలను కొందరు ఆశావహులు వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికలు జరగాల్సిందేనని పట్టు బడుతున్నారు. ఈసారి అనేక గ్రామాల్లో పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. సర్పంచ్ పదవి కోసం ఎక్కువ మంది పోటీ పడుతుండటంతో అభ్యర్థులను ఖరారు చేయడంలో పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి.

కాంగ్రెస్‌లో రెబెల్స్ బెడద ఎక్కువగా ఉంది. విజయావకాశాలపై పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారు. కీలకమైన గ్రామాల్లో ఎంత ఖర్చు చేసేందుకైనా కొందరు సిద్ధపడుతున్నారు. ఓ ఆయకట్టు గ్రామంలో పదవి కోసం రూ.50 లక్షలు ఖర్చు పెట్టేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారు. మరో ఆయకట్టు గ్రామ పంచాయతీని దక్కించుకునేందుకు రూ.50 లక్షలు ఖర్చు పెట్టేందుకు ఒకరు బరిలో దిగుతున్నారు. పార్టీల మద్దతు లేకుండా ఇండిపెండెంట్‌గానే సత్తా చూపించాలని కొందరు ఉవ్విళ్లూరుతున్నారు.

పల్లె పోరులో 'ఆమె'కు అందలం

● సగం పంచాయతీలు మహిళలకే

● జనరల్ స్థానాల్లోనూ పోటీకి వెసులుబాటు

గతంలో అతివలు వంటింటికే పరిమితం అనుకునేవారు. కానీ ప్రస్తుతం తామేమీ తక్కువ కాదంటూ అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ల కారణంగా రాజకీయాల్లోనూ పురుషులకు దీటుగా పదవులు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు పెద్దపీట వేశారు. వచ్చే నెలలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో 50శాతం స్థానాలు మహిళలకు కేటాయించారు. అంతేకాకుండా జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీ చేసేందుకు వెసులుబాటు కూడా ఉంది. దీంతో జనరల్ స్థానాల్లోనూ పోటీ చేసి పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది పదవులు చేపట్టే అవకాశం ఏర్పడింది. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉంటే గత ఎన్నికల్లో 15 స్థానాలు మహిళలకు రిజర్వు అయ్యాయి. అంతేకాకుండా జనరల్ స్థానాలైన నిడమనూరు, సూరెపల్లి పంచాయతీల్లోనూ సైతం మహిళలు పోటీ చేసి విజయం సాధించారు. అంటే మండలంలో సర్పంచులుగా పురుషులు 12మంది ఉంటే మహిళలు మాత్రం 17మంది ఎన్నికయ్యారు. అంతేకాకుండా మండలంలో నందికొండవారిగూడెం, గుంటిపల్లి, వేంపాడ్ గ్రామాల్లో ముగ్గురు సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవమైన ముగ్గురు మహిళలే కావడం విశేషం. ఈ ఎన్నికల్లో మండలంలో 14 పంచాయతీలు మహిళలకు కేటాయించారు. ఎస్టీ మహిళకు ఒకటి, ఎస్సీ మహిళలకు మూడు, బీసీ మహిళలకు మూడు, జనరల్ మహిళలకు ఏడు పంచాయతీలు రిజర్వు అయ్యాయి. కొన్ని జనరల్‌కు కేటాయించిన పంచాయతీల్లో కూడా మహిళలు పోటీ చేసే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల్లో సగం స్థానాలు కేటాయించడంతో అతివలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాజకీయంగా మహిళలు ఎదిగేందుకు దోహదం చేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని పోటీ చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పశువులు వ్యాధుల బారిన పడకుండా

జాగ్రత్తలు తీసుకోవాలి

సందీప్, మండల పశువైద్యాధికారి



ప్రస్తుతం చలికాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని మండల పశువైద్యాధికారి సందీప్ సూచించారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: చలికాలంలో పశు పెంపకందారులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

పశువైద్యాధికారి: ప్రస్తుత సీజన్‌లో పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ఇప్పటికే మండలవ్యాప్తంగా ఉచితంగా టీకాలను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయా?

పశువైద్యాధికారి: మండలకేంద్రంలోని పశువైద్యశాలతో పాటు మిగతా వైద్యశాలల్లో సైతం మందులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 11 వేల పశువులకు వ్యాక్సినేషన్ వేశాం.

ఆంధ్రజ్యోతి: వైద్య శాలలో అవసరమైన సిబ్బంది ఉన్నారా?

పశువైద్యాధికారి: మండలంలో రెండు వెటర్నరీ అసిస్టెంట్, ఒక అసిస్టెంట్ కొరత ఉన్న మాట వాస్తవమే. త్వరలోనే సిబ్బందిని భర్తీ చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



పోలేపల్లిలో తాంత్రిక పద్ధతిలో పూజలు చేస్తున్న రంజిత్ గురుస్వామి

చింతపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిరాంనగర్‌కు చెందిన మొగుతాల శంకర్ గౌడ్(గురుస్వామి) ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ చేశారు. ఈ సందర్భంగా కేరళకు చెందిన ప్రముఖ తాంత్రి రంజీత్(గురుస్వామి) ఆధ్వర్యంలో తాంత్రిక పద్ధతిలో నిర్వహించారు. 18 మెట్లపై కొబ్బరికాయలు కొట్టి తమలపాకులతో వివిధ రకాల పువ్వులతో తాంత్రిక విధానంలో పూజలు చేశారు. అంతకు ముందు అయ్యప్పకు పంచామృతాభిషేకం ఘనంగా చేశారు. గంగపుత్ర నర్సింగ్ స్వామి ఆధ్వర్యంలో భజన గీతాలు ఆలపించారు. దీంతో ప్రాంగణం ఒక్కసారిగా అయ్యప్ప శరణుఘోషతో మారుమోగింది. భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అల్పాహారం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, కేతావత్ బీల్యానాయక్, బాదేపల్లి పులిరాజ్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, మల్లోజు జగన్, పోలేపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంచా నాయక్

నాగార్జునసాగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువత అవగాహన కలిగి ఉండాలని నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ మంచానాయక్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సాగర్ హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎయిడ్స్ కేసులు తగ్గాయన్నారు. యువత ఎయిడ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్‌చంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు గోపాలకృష్ణ, ఉపేంద్రాచారి, రవీందర్, సైదమ్మ, మోరీనా, మాధురి, శ్రీ రాములు, గోపీనాథ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

చింతపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన బీఎస్పీ మండల అధ్యక్షుడు ముదిగొండ మొగిలయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లోకి చేరారు. ఈ మేరకు ఆయన బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులను గెలిపించటానికి కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు అనిత, నాగరాజు, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, అశోక్, సుదీర్, శ్రీకాంత్, విష్ణువర్ధన్, రవి, నరసింహ, కృష్ణయ్య, లక్ష్మయ్య, ధర్మారెడ్డి, జంగయ్య, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునగాల కొండల్ రావు డిగ్రీ కళాశాలలో 1988-91 సంవత్సరం డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. 37ఏళ్ల తర్వాత కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక వేదికపైకి చేరుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగ క్షేమాలు, కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రవినాయక్, పూర్వ ప్రిన్సిపాల్ తారయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కల్లు రాజేందర్‌రెడ్డి, నక్క వెంకటేష్‌యాదవ్, ఇడెం రామకృష్ణ, పున్న శైలజ, వెంకటేశ్వర్లు, అనంతలక్ష్మి, నక్క సత్తెమ్మ, ప్రమీల, వెంకటేష్, విజయ్‌కుమార్, వేణుగోపాల్, జీఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా వీరెల్లి సతీష్

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన వీరెల్లి సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎస్వీ కన్వెన్షన్‌లో జరిగిన జిల్లా కాన్ఫరెన్స్‌లో 2026 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ క్లబ్ సేవలను విస్తృతం చేయడంతో పాటు నూతన శాఖల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యే ఆర్యవైశ్యులు సభ్యులుగా ఉండే వాసవీ క్లబ్, స్థాపించిన అనతికాలంలోనే గుర్తింపు పొందడం హర్షనీయమన్నారు. క్లబ్ పీఎస్టీలు విద్య, వైద్యరంగాలలో సేవలందిస్తుండగా, మహిళా విభాగాలు సామాజిక సేవలతో ముందంజలో ఉన్నాయన్నారు. క్లబ్ సభ్యుల సహకారంతో శాశ్వత ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కన్వెన్షన్‌కు హాజరైన అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ దిశానిర్దేశం చేసి మాజీ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గజ్జల రామకృష్ణ, చింగిరికుండ రవీందర్, వంగవీటి గురుమూర్తి, రాచర్ల కమలాకర్, మిట్టపల్లి విజయభాస్కర్, కర్నాటి రమేష్, కడివెండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న క్లబ్ గవర్నర్ సతీష్

కొనసాగుతున్న 'పంచాయతీ' నామినేషన్లు



నిడమనూరులో ఓ కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి

నిడమనూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. సోమవారం రెండో రోజు వివిధ గ్రామాల్లో అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. నిడమనూరు మేజర్ పంచాయతీ నుంచి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి శేషరాజు సంధ్యశ్రీనివాస్, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి బొల్లం సునీతసైదులు నామినేషన్లు వేశారు. శాఖాపురంలో చేకూరి వంశీచరణ్, సూరయ్య, సుధాకర్, వెనిగండ్లలో కొప్పోలు స్వర్ణలత, ముప్పారంలో ఆలంపల్లి కృష్ణ, ఆలంపల్లి ప్రసాద్, నందికొండవారిగూడెంలో నందికొండ లింగారెడ్డి, సూరెపల్లిలో పోలేపల్లి కాశమ్మ, కొండేటి సుగుణమ్మ తదితరులు త మ నామినేషన్లు దాఖలు చేశారు.

త్రిపురారం: త్రిపురారం మండలంలోని 9క్లస్టర్ కేంద్రాల్లో సోమవారం రెండో రోజు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులు ముమ్మరంగా నామినేషన్లు రాత్రి 8గంటల వరకు వేశారు.

57మంది సర్పంచ్ అభ్యర్థులు, వార్డులకు 157 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో కూన్‌రెడ్డి విజయకుమారి తెలిపారు. మండలంలోని త్రిపురారం క్లస్టర్ కేంద్రాన్ని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించారు.

వేములపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. దరఖాస్తుల స్వీకరణ క్లస్టర్ కేంద్రాల వద్ద ఆద్యంతం కోలాహలం నెలకొంది. మండలంలో మొత్తం 12 సర్పంచ్ స్థానాలకు 36 నామినేషన్లు, 116 వార్డులకు 115 నామినేషన్లు దాఖలైనట్లు మండల ఎన్నికల అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు.

మాడ్గులపల్లి: మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో 238 వార్డు సభ్యులకు గాను నామినేషన్ల సోమవారం కొనసాగింది. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 66 నామినేషన్లు దాఖలు కాగా వార్డు సభ్యులకు 129 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

వారికి సర్పంచ్ పదవి దూరం

(5వ పేజీ తరువాయి)

పద్ధతిలో తాజా ఎన్నికల్లోనూ అమలు చేస్తుండడంతో 2019లో ఎస్సీలకు కేటాయించిన గ్రామాలు మినహాయించి, ఆ మండలంలో మిగిలిన గ్రామాల్లో అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం ఎస్సీ రిజర్వేషన్లు దక్కాయి. తక్కువ జనాభా ఉండి, ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ రాని గ్రామాలకు ఈ దఫా కూడా అవకాశం రాని పరిస్థితి కొనసాగింది. మొత్తంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ తరచూ రిజర్వేషన్ల అమలు విధానం మారుస్తూ వస్తుండడంతో తమ గ్రామాల్లో ఎస్సీలకు రిజర్వేషన్ అవకాశం లేకుండా పోయిందని, సర్పంచ్ అనిపించుకోవాలనే కోరిక తీరని కలగానే మిగిలిందని ఆయా గ్రామాల్లోని ఎస్సీలు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ దక్కని కొన్ని గ్రామాలు

నార్కట్‌పల్లి, నిడమనూరు, గుండ్రాంప ల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి, పేరేపల్లి, పలివెల, రత్తిపల్లి, చొల్లేడు, కోతులారం, రా మాంజిపురం, తుడిమిడి, కొండూరు, ఎరగండ్లపల్లి, ఖుదాబక్ష్‌పల్లి, పెద్దదేవులపల్లి, ము త్యాలమ్మగూడెం, చందంపేట, మూర్పునూతల, పులిచర్ల, ఊట్లపల్లి, వెలమగూ డెం, దాచారం, ఉడతలపల్లి, అంగడిపేట, వీర్లపాలెం, పగిడిమర్రి తదితర గ్రామాలలో ప్రాధాన్య స్థాయిలో ఎస్సీ జనాభా ఉన్నా, ఆయా పంచాయతీల్లో ఇప్పటివరకు ఒక్క పర్యాయం కూడా సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వ్ కాకపోవడం గమనార్హం.

ఇరుముడితో వెళ్లిన శివ, ఆంజనేయ స్వాములు

చింతపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల, గొల్లపల్లిలో శివ, ఆంజనేయస్వాములు గురుస్వామితో ఇరుముడి కట్టుకొని సోమవారం శ్రీశైలం, మద్దిమడుగుకు వెళ్లా రు. ప్రాంగణంలో స్వస్తి పుణ్యాహవచనం, శివుని, ఆంజనేయునికి అభిషేకంతో పాటు సహస్రనామావాళి పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భవానీపవన్‌కుమార్, జంగయ్య, ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

నర్సింహయ్య ఆశయ సాధనకు కృషి : భగత్



నర్సింహయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భగత్, బీఆర్ఎస్ నాయకులు

నిడమనూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య నిత్యం పేద ప్రజల కోసమే తపించి పని చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నర్సింహయ్య ఐదో వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని వేంపాడ్ స్టేజీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి పూ లమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ నర్సింహయ్య పదవిలో ఉన్నా లేకున్నా తన పోరాటా న్ని ఆపలేదని అన్నారు. ప్రజల అభ్యున్నతి కోసమే చివరి వరకు పని చేశారని గుర్తు చేశారు. పేదలు, బడుగుల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం శ్రమించారని కొనియాడారు. నాగార్జునసాగర్ నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధి నర్సింహయ్య చలవేనన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయేందర్‌రెడ్డి, రామచందర్‌నాయక్, సాదం సంపత్‌కుమార్, విరిగినేని అంజయ్య, రాంఅంజయ్య, బొల్లం రవి, బొల్లం జయమ్మ, పిడిగం నాగయ్య, మాచర్ల దాసు, బిజిలి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

● ఎస్ఐ కైగూరి నరేష్



ఎన్నికల నియమావళిని గురించి వివరిస్తున్న ఎస్ఐ నరేష్

త్రిపురారం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరూ పాటించాలని ఎస్ఐ కైగూరి నరేష్ అన్నారు. మండలంలోని దుగ్గేపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ సెంటర్‌లోకి అభ్యర్థితో పాటు అతడిని బలపరిచే మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. వంద మీటర్ల లోపలికి వాహనాల అనుమతి ఉండదన్నారు. సౌండ్ బాక్స్‌లకు అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు.

వీటీనగర్‌లో మురుగునీటితో ఇబ్బందులు



వీటీనగర్‌లో హైవేపై ప్రవహిస్తున్న మురుగునీరు

చింతపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్ (మాల్)లో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో హైవేపై మురుగునీరు ప్రవహిస్తోంది. స్థానిక వ్యాపారస్థులు మురుగునీటితో దుర్వాసన వస్తోందని అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేయలేదు. కాల్వలు నిండి హైవేపై మురుగునీరు వెళ్తుంది. వాహనదారులతో పాటు వ్యాపారస్థులకు వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు చొరవ తీసుకొని మురుగునీటిపై తగిన చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యాద్గార్‌పల్లిలో కాంగ్రెస్, వామపక్షాల పొత్తు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ పొత్తుతో పోటీ చేస్తున్నాయి. సర్పంచ్‌గా వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, 12 మంది వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి పుష్కల రవి, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహబూబ్‌అలీ, వెంకటయ్య, గాయం రజిత, జొన్నలగడ్డ అరుంధతి, కనకంటి రామకృష్ణ, పాక మధు, గువ్వల నాగమణి, గువ్వల శేఖర్, అంజి, నక్క శ్రీను, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

చింతపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు వీటీనగర్‌లో సోమవారం గీతా జయంతిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గొడకొండ్ల వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులందరూ సామూహికంగా భగవద్గీత పఠనం చేశారు. దీంతో ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంగా మారింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యుడు విష్ణుదాసు, ఆధ్యాత్మిక వేత్త పొద్దుటూరి దేవేందర్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో పలువురి చేరిక

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలగడప గ్రామంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు సోమవారం రాత్రి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సమక్షంలో సీపీఎంలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ పేదల పక్షాన నిరంతరం పోరాడే సీపీఎంనకు పేద ప్రజలు అండగా నిలవాలని కోరారు. సీపీఎం పేదల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, వెంకటయ్య, బాషబోయిన పాపయ్య, ఆలేటి బిందు తదితరులు పాల్గొన్నారు.

తుంగపాడు సర్పంచ్ అభ్యర్థిగా వెంకట్‌రెడ్డి నామినేషన్

మండలంలోని తుంగపాడు గ్రామపంచాయతీ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా వెంకట్‌రెడ్డి అధికారి వీరయ్యకు సోమవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అంతకుముందు ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు కంచుగట్ల లింగయ్యయాదవ్, మచ్చ వెంకన్న, లావూడి బలరాం, శ్రీను, చెన్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడే వారిని గెలిపించాలి

చందంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల అభివృద్ధికి పాటుపడే వారిని, బీజేపీ మద్దతుదారుల గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులడు కేతావత్ లాలునాయక్ అన్నారు. చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యులు, అభ్యర్థులను నిలబెట్టాలని, వారి గెలుపునకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..

'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

సంప్రదించగలరు : మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా

ACM - 9985411394 Miryalguda ACO - 9963624250, Miryalguda SR - 9542690885, Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544